Follow: @ANNTELUGU

11-06-2025

ANN తెలుగు

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 189 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




ప్రత్యేక కథనం 4లో

టాప్ న్యూస్


## కిషన్ రెడ్డికి రాజాసింగ్ మరో వార్నింగ్!



- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి ఎంపికపై కామెంట్స్
- కుల సమీకరణాల ఆధారంగా టికెట్ కేటాయిస్తారంటూ కిషన్ రెడ్డిపై పరోక్ష వ్యాఖ్యలు
- సీనియర్స్ కి అవకాశం కల్పిస్తారా అనేది తేల్చాలని అల్టిమేటం!

02

## కాంగ్రెస్ పార్టీలో పని చేసిన వారికే పదవులు



- హామీలకు పదవులు రావు
- సీఎం రేవంత్ మంత్రివర్గ విస్తరణ దేశానికే ఆదర్శం
- ఎస్సీ, బీసీలకు గతంలో ఎన్నడూ లేనంత ప్రాధాన్యం
- రాహుల్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకు వెళ్తున్న సీఎం రేవంత్
- జీహెచ్ఎంసీ కోటాలో మంత్రి పదవికి ఇంకా సమయం ఉంది
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

02

## హనుమాన్‌గా మహేశ్?



- రాజమౌళి మూవీలో రామాయణ్ ఎపిసోడ్
- ఫ్యాన్స్‌కు గూస్ బంప్స్

02



## సామాజిక న్యాయానికి కేరాఫ్ కాంగ్రెస్

- పార్టీలో ఎవరికైనా అవకాశాలు దక్కుతాయి: భట్టి
- డిప్యూటీ సీఎం, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన కొత్త మంత్రులు

వివరాలు 3లో



బస్ పాస్ ఛార్జీలను తగ్గించాలని

## బస్ భవన్ వద్ద ఎమ్మెల్సీ కవిత ఆందోళన

- గేటు వద్ద అడ్డుకున్న పోలీసులు
- కవిత, జాగృతి కార్యకర్తలను వాహనాల్లో తరలించిన పోలీసులు

వివరాలు 2లో



## తొలిసారి ఎంపీగా కమల్

- రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నిక
- తమిళనాడు నుంచి ఎగువ సభకు ఆరుగురు

వివరాలు 2లో

## దేశాన్ని చీల్చేందుకు బీజేపీ కుట్ర!

- మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు
- రాజ్యాంగాన్ని మార్చేందుకు కూడా కేంద్రం ప్రయత్నిస్తోంది
- యుద్ధం చేయమంటే ట్రంప్ సూచనతో మోదీ వెంటనే వెనక్కి తగ్గారు
- బీజేపీపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్

వివరాలు 3లో

# రాహుల్ మార్క్

## శాఖల్లో షాకులు



మంత్రుల ప్రోగ్రెస్ రిపోర్ట్ పై సీఎంను ఆరాతీసిన రాహుల్

**పనితీరు, ఆరోపణలపై చర్చ**

పునర్వ్యవస్థీకరణకు డిసైడ్.. కీలక మంత్రుల శాఖలు చేంజ్

ఉత్తమ్, భట్టి విక్రమార్కలకు ఢిల్లీ నుండి పిలుపు

మంత్రులందరి శాఖల్లోనూ భారీ మార్పులు

నేడు కొలిక్కి వచ్చే అవకాశం

**హైదరాబాద్, మహా**

తెలంగాణ మంత్రివర్గం రాహుల్ మార్క్ కనబడుతుంది. గత ఏడాదిన్నర కాలంగా తెలంగాణ మంత్రుల పనితీరుపై తనకు వచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా మంగళవారం తనను కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పలు ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వవర్గాల నుండి ఉన్న సమాచారం, ఇంటెలిజెన్స్ నివేదికలతో పాటు ఏఐసీసీ సర్వేలు, ఇన్ ఛార్జిల నివేదికలు అన్నింటినీ క్రోడీకరించుకుని రాహుల్ మాట్లాడినట్లు తెలిసింది. కొత్త మంత్రుల శాఖలు, బిసి కులగగణన, ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభల నిర్వహణ తేదీల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రాహుల్, ఖర్గేను కలిశారు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఆసక్తికర పరిణామాలుఉ కేబినెట్ లో భారీ మార్పుల దిశగా సాగినట్లు తెలుస్తోంది.

మిగతా 2లో

## హోం రేసులో ముగ్గురు



ప్రచారంలో ఉత్తమ్, భట్టి, సీతక్క?

రెవెన్యూ, ఆర్థిక, పంచాయతీరాజ్, పౌరసరఫరాల్లో మార్పులు

పొంగులేటి, దామోదర శాఖల్లోనూ మార్పులు?

వివరాలు 2లో

# కేసీఆర్ విచారణ

## నేడు కాళేశ్వరం కమిషన్ ఎంక్వైరీ ఫైనల్

కేసీఆర్ కు మద్దతుగా భారీగా బీఆర్ఎస్ కార్యకర్తలు

జిల్లాల నుండి పదివేలమందికి పైగా కార్యకర్తలు వచ్చేలా ప్లాన్

వర్చువల్ గా హాజరుకానున్న కేసీఆర్

కేసీఆర్ తరుపున భారీ ఫైల్ ను కమిషన్ కు సమర్పించే అవకాశం



**హైదరాబాద్, మహా :**

కాళేశ్వరం కమిషన్ విచారణ ఫైనల్ కు చేరుకుంది. ఇప్పటికే వందమందికి పైగా విచారించిన కాళేశ్వరం కమిషన్ చివరగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను విచారణ చేయనున్నది. కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నోటీసుల ప్రకారం 11వ తేదీనకమిషన్ విచారణ కు కేసీఆర్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలోనే ముందు నుండి మహా పేర్కొన్నట్లుగా ఓపెన్ కోర్టు కాకుండా వర్చువల్ గా, కెమెరా ద్వారా విచారణకు కేసీఆర్ హాజరు కానున్నట్లు తెలుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి హోదాలో విచారణకు హాజరయ్యేలా కమిషన్ అవకాశం కల్పించినట్లు తెలిసింది. బుధవారం కమిషన్ ముందుకు ఉదయం 11 : 15 గం.లకు విచారణకు కేసీఆర్ హాజరుకానున్నారు. కాళేశ్వరంపై కేసీఆర్ ను విచారించేందుకు జస్టిస్ ఘోష్ కమిషన్ ఇప్పటికే ప్రశ్నావళిని సిద్ధం


మిగతా 2లో

### భారీ నివేదిక అందజేయనున్న కేసీఆర్?

కాళేశ్వరం కమిషన్ కు గత కొద్దిరోజులుగా న్యాయనిపుణులతో సంప్రదించి రూపొందించిన బారీ నివేదికను కేసీఆర్ తరుపున కమిషన్ కు అందజేసే అవకాశాలున్నాయి. కేసీఆర్ వర్చువల్ గా హాజరు అవుతున్నా కార్యకర్తలు భారీగా తరలిరావాలని హైదరాబాద్ చుట్టు పక్కల నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు పార్టీ కార్యాలయం నుండి సంకేతాలు అందాయి. దీంతో కేసీఆర్ కు మద్దతుగా బుధవారం హైదరాబాద్ లో పరేడ్ జరిగే సూచనలున్నాయి.

## నేడు మరోసారి విచారణకు ప్రభాకర్ రావు

- కూపీ లాగనున్న సిట్ అధికారులు
- కొలిక్కి రానున్న మరిన్ని ఫోన్ ట్యాప్ వివరాలు
- కీలకం కానున్న ప్రభాకర్ రావు స్టేట్ మెంట్



వివరాలు 2లో




## 11 ఏళ్లలో అద్భుత ప్రగతి

### అణగారిన వర్గాలకు బీజేపీ పెద్దపీట

- మోదీ ప్రభుత్వంపై ఒక్క అవినీతి ఆరోపణ లేదు
- మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల అభివృద్ధి బుక్ రిలీజ్ కార్యక్రమంలో కిషన్ రెడ్డి
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ, తాజా రాజకీయ పరిణామాలు సహా పలు అంశాలపై చర్చ

03

# జులై ఫస్ట్ వీక్‌లో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

## ఆగస్టు 14 నుంచి తరగతులు ప్రారంభం

సిలబస్ మార్పుపై కూడా కసరత్తు జరుగుతోంది

ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి వెల్లడి



**మహా:** రాష్ట్రంలో ఇంటర్ పూర్తి చేసుకుని ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించిన ఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వచ్చే నెలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 29 నుంచి మే 4 వరకు జరిగిన ఈఏపీ సెట్ ఆన్‌లైన్ పరీక్ష ఫలితాలు మే 11వ తేదీన విడుదలయ్యాయి. ఎప్ సెట్ ఫలితాల్లో ఇంజినీరింగ్ విభాగంలో 73.29 శాతం ఉత్తీర్ణతతో 1,51,779 మంది విద్యార్థులు క్వాలిఫై కాగా అగ్రికల్చర్‌ఫార్మా విభాగంలో

మిగతా 2లో

## ఈసారి బోనాలు అదిరిపోవాలె

- నిర్వహణకు ఇప్పటివరకు రూ.20 కోట్లు ఇచ్చాం
- భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదు: మంత్రి కొండా సురేఖ
- ఆషాఢ బోనాలపై మంత్రి పొన్నంతో రివ్యూ

02

# రాహుల్ మార్క్

## శాఖల్లో షాకులు

- మంత్రుల ప్రోగ్రెస్ రిపోర్ట్ పై సీఎంను ఆరాతీసిన రాహుల్
- పనితీరు, ఆరోపణలపై చర్చ
- పునర్వ్యవస్థీకరణకు డిసైడ్.. కీలక మంత్రుల శాఖలు ఛేంజ్
- ఉత్తమ్, భట్టి విక్రమార్కలకు ఢిల్లీ నుండి పిలుపు
- మంత్రులందరి శాఖల్లోనూ భారీ మార్పులు
- నేడు కొలిక్కి వచ్చే అవకాశం



(మొదటిపేజీ తరువాయి)

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ కు కూడా ఇవి దారితీసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. తొలుత వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ లకు సాధారణ శాఖలు లభించే అవకాశముందని, ముఖ్యమంత్రి వద్ద మిగిలిన శాఖల్లో కొన్ని కేటాయించవచ్చని చర్చ జరగ్గా.. ఇపుడు అందరి శాఖల్లోనూ మార్పులకు అవకాశం కనబడుతోంది. సామాజిక న్యాయంతో పాటు పనితీరు ఆధారంగా శాఖల్లో మార్పులు చేయాలని రాహుల్ గాంధీ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. పనితీరు సరిగా లేని, ఆరోపణలున్న వారిని కేబినెట్ లో ఎందుకు కొనసాగించాలని హైకమాండ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. శాఖల మార్పు మాత్రమే కాకుండా పునర్వ్యవస్థీకరణ చేస్తే ఎలా ఉంటుందన్న చర్చలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే పెండింగ్ మంత్రిత్వశాఖలు కూడా భర్తీ అయ్యే సూచనలు ఉన్నాయి. మొదట అనుకున్న ప్రణాళిక ప్రకారం స్థానిక ఎన్నికలు ముగిశాక మిగతా పదవులు భర్తీచేయాల్సి ఉన్నది.

**ఏఐసిసి అగ్రనేతలతో సీఎం భేటీ**

ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఏఐసీసీ అగ్రనేతలతో సమావేశమయ్యారు. మంత్రివర్గ విస్తరణ తదనంతర పరిస్థితులను వారికి వివరించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీతో సమావేశమయ్యారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో పలువురు మంత్రుల శాఖల్లో మార్పులపైనా చర్చించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి వద్దే 11 శాఖలు ఉండగా కీలకమైన మున్సిపల్, హోం, విద్యాశాఖలు సైతం ముఖ్యమంత్రే చూస్తున్నారు. కొత్తవారికి కేటాయించే శాఖలపై సమాలోచనలు జరిపినట్లు తెలుస్తోంది. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణనను జనంలోకి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్రంలో రెండు బహిరంగసభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి అధిష్టానానికి వివరించారు. ఈ సభలకు రావాలని ఖర్గే, రాహుల్‌గాంధీకి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన తేదీలు ఖరారు చేయాలని కోరినట్లు సమాచారం. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో కాంగ్రెస్ చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఖర్గే, రాహుల్‌గాంధీలు రేవంత్‌కు దిశానిర్దేశం చేశారు. మోదీ 11 ఏళ్ల పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్పష్టంచేశారు. బీజేపీ వైఫల్యాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేలా చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది.

**మంత్రుల శాఖల్లో భారీ మార్పులు?**

మరోవైపు అధిష్ఠానం పిలుపు మేరకు మధ్యాహ్నం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సాయంత్రం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీకి వెళ్ళారు. మంత్రులు సమావేశాల్లో ఉన్న సమయంలోనే ఢిల్లీ నుండి ఫోన్ రావడం, హుటాహుటిన వెళ్ళడం జరిగిపోయాయి. మంత్రివర్గంలో శాఖల కేటాయింపుపై అధిష్ఠానంతో చర్చలలో నేతలు కూడా భాగస్వామ్యం కానున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, వివేక్‌కు ఇంకా శాఖలు కేటాయించలేదు. ఈ ముగ్గురికి శాఖల కేటాయింపుతో పాటు మిగతా మంత్రుల శాఖల్లోనూ మార్పులు చేర్పులు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దే 11 శాఖలు ఉండగా కీలకమైన మున్సిపల్, హోమ్, విద్యాశాఖలు సైతం ఆయనే చూస్తున్నారు.

**ఉత్తమ్ కు రెవెన్యూ లేదా ఆర్థికం?**

ఉత్తమ్ కు నీటిపారుదల శాఖ మాత్రమే కాకుండా మరో కీలక శాఖ అప్పగించవచ్చన్న చర్చలున్నాయి. పౌరసరఫరాల శాఖ బదులు రెవెన్యూ లేదా ఆర్థిక శాఖ అప్పగించవచ్చన్న ప్రచారం ఢిల్లీలో జరుగుతోంది. మరోవైపు భట్టికి ప్రస్తుతమున్న ఆర్థిక, విద్యుత్ బదులు హోం శాఖ అప్పగించవచ్చని, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పంచాయతీరాజ్ శాఖ అప్పగించవచ్చని, శ్రీధర్ బాబుకు మునిసిపల్ శాఖ అప్పగించవచ్చని, వివేక్ కు విద్యాశాఖ, వాకిటి శ్రీహరికి హోం లేదా పశుసంవర్ధక శాఖలు అప్పగించవచ్చని ప్రచారం జరిగింది. సీతక్కకు కూడా హోంశాఖ ఇవ్వవచ్చన్న ప్రచారముంది. మొత్తం అందరి శాఖలను పునర్వ్యవస్థీకరించి కొత్త వాటిని కేటాయిస్తే ఎలా ఉంటుందని, లేదా మిగిలిన శాఖల్లోనే కొత్త మంత్రులకు కేటాయించాలా అని హైకమాండ్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరికి కి ప్రాధాన్య శాఖలు ఇవ్వాలని హైకమాండ్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. శాఖల్లో షాకులు తగులుతాయా? సంచలనాలుంటాయా? లేక పెద్దగా మార్పుల జోలికి వెళ్ళకుండా మిగిలిన శాఖలతోనే సరిపెడతారా? అన్నది బుధవారం తేలే అవకాశాలున్నాయి.

# బస్ పాస్ ఛార్జీలను తగ్గించాలని
# బస్ భవన్ వద్ద ఎమ్మెల్సీ కవిత ఆందోళన

- గేటు వద్ద అడ్డుకున్న పోలీసులు
- కవిత, జాగృతి కార్యకర్తలను వాహనాల్లో తరలించిన పోలీసులు



**మహా :** పెంచిన బస్ పాస్ చార్జీలను తగ్గించాలని బస్ భవన్ వద్ద ఆందోళన చేస్తున్న ఎమ్మెల్సీ కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. బస్ పాస్ ఛార్జీలను తగ్గించాలని బస్ భవన్ గేటు ముందు రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన కవితతో పాటు జాగృతి కార్యకర్తలను పోలీసులు వాహనాల్లో తరలించారు. ఎమ్మెల్సీ కవితను కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బస్ పాస్ ఛార్జీలను పెంచినట్లు ఆర్టీసీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థుల బస్ పాస్ ఛార్జీలను గత మూడేళ్లుగా పెంచలేదని, పెరిగిన ఖర్చుల కారణంగా ఇప్పుడు అన్ని రకాల పాస్‌ల ఛార్జీలను పెంచుతున్నట్లు పేర్కొంది. సాధారణ ప్రజలతో పాటు స్టూడెంట్ పాస్ ధరలను పెంచింది. తెలంగాణ ఆర్టీసీ 20 శాతానికి పైగా బస్ పాస్ రేట్లను పెంచింది. రూ.1,150 ఉన్న ఆర్డినరీ పాస్ ధర రూ.1,400కు పెరగగా.. రూ.1,300 ఉన్న మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్ ధర రూ.1,600కు పెరిగింది. లనే రూ.1,450 ఉన్న మెట్రో డీలక్స్ పాస్ ధర రూ.1,800కు పెరిగింది. బస్ పాస్ ఛార్జీల పెంపుకు వ్యతిరేకంగా ఎమ్మెల్సీ కవిత ఈరోజు బస్ భవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. మంగళవారం జాగృతి కార్యకర్తలు పెద్ద ఎత్తున బస్ భవన్ చేరుకున్నారు. బస్ భవన్ గేటు ముందు రహదారిపై బైఠాయించిన కవిత నిరసన వ్యక్తం చేశారు. బస్ పాస్ ఛార్జీలను తగ్గించాలి అంటూ నినాదాలు చేశారు. బస్ భవన్ వద్ద ఆందోళన చేస్తున్న కవితను పోలీసులు అరెస్ట్ చేసి.. కంచన్ బాగ్ స్టేషన్‌కు తరలించారు.

**కవిత దర్నాకు బీఆర్ఎస్ దూరం**

బస్ భవన్ వద్ద కవిత నిర్వహించిన ధర్నాకు బీఆర్ఎస్ శ్రేణులు పూర్తి దూరంగా ఉన్నాయి. గతంలో జాగృతి తరఫున ధర్నాలు, కార్యక్రమాలను నిర్వహించినపుడు కొంత మంది గులాబీ కండువాలతో పాల్గొనేవారు కానీ ఈ ధర్నాలో ఒక్క గులాబీ కండువా కూడా కనిపించకపోవడం చూసతుంటే బీఆర్ఎస్ తో కవిత దాదాపు తెగతెంపులు చేసుకున్నారన్న అనుమానాలకు మరింత బలం చేకూరుతుంది.

# ఈసారి బోనాలు అదిరిపోవాలె

## నిర్వహణకు ఇప్పటివరకు రూ.20 కోట్లు ఇచ్చాం

### భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదు: మంత్రి కొండా సురేఖ

### ఆషాఢ బోనాలపై మంత్రి పొన్నంతో రివ్యూ




అప్లికేషన్ పెట్టుకోవాలి: పొన్నం

**మహా:** ఆషాఢ మాసం బోనాలకు తెలంగాణ సిద్ధమవుతోంది. డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడానికి చేయాల్సిన ఏర్పాట్లపై మంత్రులు, అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈసారి బోనాల కోసం రాష్ట్రప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించింది. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. బోనాలు ఈసారి అదిరిపోవాలని, జూన్ 26 నుండి జరిగే ఆషాఢ బోనాల పండుగకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందని తెలిపారు.

**ఇబ్బందులు లేకుండా చూడాలి..**

నిధుల కేటాయింపు ఎండోమెంట్ శాఖ పరిధిలో ఉన్న అన్ని దేవాలయాలకు ఈ నిధులు విడుదల చేస్తారు. ఈ నిధులను దేవాలయాలకు రంగురంగుల పూలు, ఎల్ఈడీ లైట్లతో అలంకరించడంతో పాటు, వాటికి రంగులు వేయడంలాంటి పనులకు ఉపయోగిస్తారు. ఉత్సవాల సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు నగరంలోని 28 ముఖ్యమైన దేవాలయాలలో పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. ఇబ్బందులు లేకుండా చూడాలి ఉత్సవాల సందర్భంగా వీఐపీల కదలికల సమయంలో తొక్కిసలాటలు జరుగుతున్నాయని, అందువల్ల తొక్కిసలాట వంటి పరిస్థితులు జరగకుండా చూడాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈసారి వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందన్నారు. జోగినీలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉత్సవాల సమయంలో అనవసరమైన సమస్యలను నివారించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి సూచించారు. అమ్మవారి ఆశీర్వాదం తీసుకోవడానికి ఆలయానికి వెళ్ళేటప్పుడు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని అధికారులకు స్పష్టం చేశారు. జూన్ 26న తొలి బోనం జూన్ 26 గోల్కొండతో తొలి బోనం ప్రారంభం అవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జూలై 1 బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, 13 వ తేదీ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర, 14 వ తేదీ రంగం, 20 నాడు అక్కన్న మాదన్న బోనాల జాతర, లాల్ దర్వాజా బైబిలు జరుగుతాయి.. జూలై 24 కి ఈ బోనాల ఉత్సవాలు ముగుస్తాయి. ఇంకా ఏదైనా దేవాలయానికి రాని నిధులు ఉంటే దేవాదాయ శాఖకు అప్లికేషన్ పెట్టుకోవాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ విచారణ

## నేడు కాళేశ్వరం కమిషన్ ఎంక్వైరీ ఫైనల్



(మొదటిపేజీ తరువాయి)

చేయగా, ఉత్కంఠ నెలకొంది. కేసీఆర్‌పై కాళేశ్వరం కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించే అవకాశం ఉంది. మరోవైపు సమాధానాలపై కేసీఆర్ సుదీర్ఘ కసరత్తు సైతం చేసినట్లు సమాచారం. కమిషన్ ప్రశ్నలకు కేసీఆర్ ఎలా స్పందిస్తారని తెలుగు రాష్ట్రాల ప్రజలు, రాజకీయ నాయకులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ఇప్పటి వరకు వంద మందికి పైగా కమిషన్ విచారణ చేసింది. తాజాగా మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావు విచారణకు హాజరయ్యారు. కేసీఆర్ విచారణతో ఇది పూర్తయ్యే అవకాశాలున్నాయి. తర్వాత నివేదిక రూపొందించి ఫైనల్ చేసే అవకాశాలున్నాయి.

**కేసీఆర్ తో హరీష్ సుదీర్ఘ భేటీ**

కాళేశ్వరం విచారణ నేపథ్యంలో రూపకర్త కేసీఆర్ మాజీమంత్రి హరీష్ అనేకసార్లు సమావేశమై చర్చించారు. విచారణ ముగిసిన అనంతరం సోమవారం కూడా కేసీఆర్ తో సమావేశమయ్యారు. మంగళవారం కూడా ఐదారుగంటలకు పైగా కేసీఆర్ తోనే హరీష్ ఉన్నారు. కమిషన్ తీరు ఎలా ఉంది? ఎలా స్పందించాలి? అన్నదానిపై న్యాయ, జలనిపుణులతో కలిసి చర్చించారు. కమిషన్ అభ్యంతరాలు, అనుమానాలపైనా నిపుణుల సలహాలు తీసుకున్నట్లు తెలిసింది.

# హోం రేసులో ముగ్గురు

## ప్రచారంలో ఉత్తమ్, భట్టి, సీతక్క?

### రెవెన్యూ, ఆర్థిక, పంచాయతీరాజ్, పౌరసరఫరాల్లో మార్పులు

### పొంగులేటి, దామోదర శాఖల్లోనూ మార్పులు?



**మహా:** రాష్ట్రంలో కీలక మంత్రిగా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డికి మరింత ప్రాధాన్యశాఖలు దక్కే అవకాశాలున్నాయన్న ప్రచారం జరుగుతోంది. పౌరసరఫరాల శాఖ బదులు రెవెన్యూ లేదా ఆర్థిక శాఖ అప్పగించవచ్చన్న ప్రచారం ఢిల్లీలో జరుగుతోంది. మరోవైపు భట్టికి ప్రస్తుతమున్న ఆర్థిక, విద్యుత్ బదులు హోం శాఖ అప్పగించవచ్చని, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పంచాయతీరాజ్ శాఖ అప్పగించవచ్చని, శ్రీధర్ బాబుకు మునిసిపల్ శాఖ అప్పగించవచ్చని, వివేక్ కు విద్యాశాఖ, వాకిటి శ్రీహరికి హోం లేదా పశుసంవర్ధక శాఖలు అప్పగించవచ్చని ప్రచారం జరిగింది. సీతక్కకు కూడా హోంశాఖ ఇవ్వవచ్చన్న ప్రచారముంది. మొత్తం అందరి శాఖలను పునర్వ్యవస్థీకరించి కొత్త వాటిని కేటాయిస్తే ఎలా ఉంటుందని, లేదా మిగిలిన శాఖల్లోనే కొత్త మంత్రులకు కేటాయించాలా అని హైకమాండ్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరికి కి ప్రాధాన్య శాఖలు ఇవ్వాలని హైకమాండ్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. శాఖల్లో షాకులు తగులుతాయా? సంచలనాలుంటాయా? లేక పెద్దగా మార్పుల జోలికి వెళ్ళకుండా మిగిలిన శాఖలతోనే సరిపెడతారా? అన్నది బుధవారం తేలే అవకాశాలున్నాయి.

# జులై ఫస్ట్ వీక్‌లో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్



(మొదటిపేజీ తరువాయి)

87.82 శాతం ఉత్తీర్ణతతో 71,309 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

**ఆ విద్యా సంస్థలకు నోటీసులు కూడా..**

అయితే ఇంజనీరింగ్ విభాగాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వచ్చే నెల జులై మొదటి వారం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్టు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ విషయాలను విద్యార్థులు వారి తల్లి దండ్రులు దృష్టిలో పెట్టుకొని సంబంధిత పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు . అగస్టు 14లోపు ఈ ప్రక్రియను పూర్తి చేసి ఆయా కళాశాల్లో విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరుపుతామని స్పష్టం చేశారు. అలాగే అనుమతి లేకుండా కొందరు విద్యాసంస్థలు నడుపుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. అలాంటి కాలేజీలలో విద్యార్థులు చేరుతున్నారని.. ఇలా అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కొన్ని విద్యా సంస్థలకు నోటీసులు కూడా ఇచ్చినట్టు ఆయన చెప్పుకొచ్చారు. ఈనెల 13 వరకు ఆయా సంస్థలు నోటీసులు వివరణ ఇవ్వాల్సిందిగా ఆయన తెలిపారు. మరోవైపు బీ కేటగిరీ సీట్ల అంశంపై ఇంకా స్పష్టత రాలేదని ఆయన తెలిపారు. బీ కేటగిరి సీట్ల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని.. సిలబస్ మార్పుపై కూడా కసరత్తు జరుగుతోందని ఆయన అన్నారు. వివిధ కాలేజీల్లోని కోర్సుల ఎంపికపై విద్యార్థులకు హెల్ప్‌లైన్ సదుపాయం ఏర్పాటు చేయనున్నట్టు ఆయన వెల్లడించారు.

# కాంగ్రెస్ పార్టీలో పని చేసిన వారికే పదవులు

## ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



**మహా :** కాంగ్రెస్ పార్టీలో పదవులు ఆశించేవారు కేవలం హామీలపైనే ఆధారపడకూడదని, నిబద్ధతతో పనిచేస్తేనే తగిన గుర్తింపు లభిస్తుందని ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్ అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేపట్టిన మంత్రివర్గ విస్తరణ దేశానికే ఆదర్శప్రాయంగా నిలిచిందని ఆయన కొనియాడారు. మంగళవారం పలు కార్యక్రమాల్లో దానం నాగేందర్ పాల్గొన్నారు. హిమాయత్‌నగర్‌లో సుమారు 60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం, ఆదర్శ్ నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో 150 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక న్యాయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ మంత్రివర్గ కూర్పును చేపట్టారని తెలిపారు. "గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో కూడా ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎస్సీ, బీసీ వారికి మంత్రివర్గంలో పెద్దపీట వేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆశయాలను, ఆయన ఆలోచనా విధానాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థవంతంగా ముందుకు తీసుకెళుతున్నారు" అని అన్నారు. జీహెచ్ఎంసీ పరిధి నుంచి ఎవరికైనా మంత్రి పదవి దక్కే అవకాశం ఉందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు దానం నాగేందర్ స్పందిస్తూ, దానికి ఇంకా సమయం ఉందని, అందరూ వేచి చూడాల్సి ఉంటుందని సూచించారు. మంత్రివర్గంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మంత్రులందరికీ ఆయన తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# హనుమాన్‌గా మహేశ్?

## రాజమౌళి మూవీలో రామాయణ్ ఎపిసోడ్.. ఫ్యాన్స్‌కు గూస్‌బంప్సే



**మహా:** సూపర్‌స్టార్ మహేష్ బాబు,మాస్టర్ స్టోరీటెల్లర్ ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న సినిమా ఎస్ ఎస్ ఎంబి 29 గురించి ఇప్పటికే సినీ ప్రపంచంలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా ఇతిహాసానికి చెందిన గాథలు, పురాణాల చుట్టూ తిరిగే కథతో తెరకెక్కుతుందనే వార్తలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా కథ రామాయణంలోని సంజీవని మొక్క ఆధారంగా సాగే అవకాశముందని ఊహాగానాలు వెలువడుతున్నాయి. దీంతో ఫ్యాన్స్ ఉత్కంఠకు లోనవుతున్నారు. ఇతిహాస గాథలలో హనుమంతుడు హిమాలయాలకు వెళ్లి తీసుకువచ్చిన సంజీవని వల్ల లక్ష్మణుడి ప్రాణాలు నిలిచాయి. అదే ఆధారంగా, రాజమౌళి మూవీ లో మహేష్ బాబు పాత్ర ఒక విశిష్టమైన బాధ్యతను మోస్తూ, సమకాలీన ప్రపంచంలో సంజీవని మొక్కను వెతకడానికి పయనమవుతుందట. ఈ అన్వేషణ ఒక యాత్రగా మారుతుంది – భౌగోళికంగా కాదు, భౌతికంగా కాదు, ఆధ్యాత్మికంగా, మానవీయ విలువల దిశగా కూడా సాగుతుందన్న ప్రచారం సినిమాపై అంచనాలను ఆకాశానికి తాకిస్తోంది. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించాలనే ఆలోచనలు ఉన్నాయి.

# నేడు మరోసారి విచారణకు ప్రభాకర్ రావు

- కూపీ లాగనున్న సిట్ అధికారులు
- కొలిక్కి రానున్న మరిన్ని ఫోన్ ట్యాప్ వివరాలు
- కీలకం కానున్న ప్రభాకర్ రావు స్టేట్ మెంట్

**మహా:** ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును నేడు మరోసారి విచారణ రావాలని అధికారులు ఆదేశించారు. ఈ నెల 9 న సిట్ అధికారులు ఆయన్ను సుమారు 8 గంటల పాటు విచారణ చేశారు. డీసీపీ విజయ్, ఏసీపీ వెంకటగిరి.. ప్రభాకర్ రావుపై ప్రశ్నల వర్షం కురిపించారు. రాధాకిషన్‌రావు, తిరుపతన్న, ప్రణీత్‌రావు, భుజంగరావు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా పోలీసులు పలు విధాలుగా ప్రశ్నలు అడిగారు. అలాగే, ఇప్పటి వరకు సేకరించిన ఆధారాలను ప్రభాకర్ రావు ముందు ఉంచి ప్రశ్నించినట్లు తెలుస్తోంది. జూన్ 11న (నేడు) మరోసారి విచారణకు రావాలని పోలీసులు ప్రభాకర్ రావుకు తెలిపారు.

**సిట్ ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి..**

ఎస్ఐబీ చీఫ్ గా ఎవరి ఆదేశాలతో ఫోన్ ట్యాపింగ్ చేశారు..కేసు నమోదు కాగానే విదేశాలకు ఎందుకు వెళ్లిపోయారు..ప్రణిత్ రావుతో హార్డ్‌డిస్కలను ధ్వంసం చేయించారు ఎందుకు?..ఎవరి ఆదేశాలతో వాటిని ధ్వంసం చేయించారు వంటి ప్రశ్నలను సిట్ బృందం సంధించింది. ఎవరి ఆదేశాలతో ఫోన్ ట్యాపింగ్ కోసం స్పెషల్ ఆపరేషన్ బృందాన్ని ఏర్పాటు చేశారు?.. శ్రవణ్ రావుకు ఎస్ఐబీకి ఉన్న సంబంధం ఏంటి? అని సిట్ ప్రభాకర్ రావును ప్రశ్నించింది. సిట్ అధికారులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభాకర్ రావు సమాధానం చెప్పడంలో తడబడినట్లుగా సమాచారం. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులుగా ఉన్న ఏసీపీలు భుజంగరావు, తిరుపతన్న, డీసీపీ రాధాకిషన్ రావు, డీఎస్పీ ప్రణీత్ రావులను విచారించిన సిట్ వారి నుంచి రాబట్టిన సమాచారం..ఆధారాలతో ప్రభాకర్ రావును విచారిస్తుంది. దీంతో సిట్ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలివ్వడంలో ప్రభాకర్ రావు నీళ్లు నమిలారని సమాచారం.

# కిషన్ రెడ్డికి రాజాసింగ్ మరో వార్నింగ్!

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి ఎంపికపై కామెంట్స్

### కుల సమీకరణాల ఆధారంగా టికెట్ కేటాయిస్తారంటూ కిషన్ రెడ్డిపై పరోక్ష వ్యాఖ్యలు

### సీనియర్స్ కి అవకాశం కల్పిస్తారా అనేది తేల్చాలని అల్టిమేటం!

**మహా:** సొంత పార్టీ నేతలను టార్గెట్ గా గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి తనదైన శైలిలో కీలక వ్యాఖ్యలు చేసి రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీశారు. జూబ్లీహిల్స్ శాసనసభ స్థానానికి త్వరలో జరగనున్న ఉప ఎన్నికల్లో అభ్యర్థి ఎంపిక విషయంలో బీజేపీ కుల సమీకరణాలను పరిగణనలోకి తీసుకోబోతోందంటూ ఆయన పరోక్షంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి.

**సీనియర్ నాయకులకు అవకాశం..**


మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రాజాసింగ్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక సుమారు ఆరు నెలల తర్వాత ఉంటుందని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ తన ముస్లిం ఓటు బ్యాంకును బీఆర్ఎస్‌కు అమ్ముకుందని ఆయన ఆరోపించారు. అయితే, రానున్న ఉప ఎన్నికలో ఎంఐఎం నేతలు ముస్లిం ఓట్లను బీఆర్ఎస్‌కే విక్రయిస్తారా లేక కాంగ్రెస్ పార్టీకి అమ్ముతారా అనేది వేచి చూడాలని వ్యాఖ్యానించారు. బీజేపీ అభ్యర్థి ఎంపిక విషయానికొస్తే, గతంలో పార్టీలో కుల రాజకీయాలు నడిచాయని రాజాసింగ్ అన్నారు. ఇప్పుడు కూడా అలాంటి కుల రాజకీయాలే పునరావృతమవుతాయా లేక పార్టీలోని సీనియర్ నాయకులకు అవకాశం కల్పిస్తారా అనేది తేలాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఉప ఎన్నిక అనివార్యం..**

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ఉన్న బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ సోమవారం అనారోగ్యంతో కన్నుమూసిన విషయం తెలిసిందే. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ పరిణామంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి త్వరలో ఉప ఎన్నిక అనివార్యమైంది.

# తొలిసారి ఎంపీగా కమల్

## రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నిక.. తమిళనాడు నుంచి ఎగువ సభకు ఆరుగురు



**మహా:** ప్రముఖ నటుడు,మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత కమల్ హాసన్ సహా తమిళనాడు నుంచి ఆరుగురు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధికార డీఎంకే నుంచి ముగ్గురు, ప్రతిపక్ష ఏఐడీఎంకే నుంచి ఇద్దరు, ఎంఎన్ఎం నుంచి కమల్ హాసన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల పరిశీలన తర్వాత డీఎంకే, ఏఐడీఎంకే, ఎంఎన్ఎం సభ్యుల నామపత్రాలు ఆమోదం పొందినట్లు అధికారులు ప్రకటించారు. మొత్తం ఏడుగురు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరణకు గురైనట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతీ అభ్యర్థికి సుమారు 10 మంది ఎమ్మెల్యేల మద్దతు తెలపాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే స్వతంత్ర అభ్యర్థులకు ఎమ్మెల్యేల మద్దతు లేకపోవడంతో నామినేషన్ తిరస్కరణకు గురైంది. నామినేషన్ల విత్ డ్రాకు జూన్ 12 వరకు గడువు ఉంది. ఈ నేపథ్యంలోనే ఈనెల 12న రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైనట్లు ఆ ఆరుగురికి సర్టిఫికెట్లు అందజేయనున్నారు.

# 11 ఏళ్లలో అద్భుత ప్రగతి

అణగారిన వర్గాలకు బీజేపీ పెద్దపీట.. మోదీ ప్రభుత్వంపై ఒక్క అవినీతి ఆరోపణ లేదు
'మోడీ ప్రభుత్వం 11 ఏళ్ల అభివృద్ధి' బుక్ రిలీజ్ కార్యక్రమంలో కిషన్ రెడ్డి
సీఎం చంద్రబాబుతో భేటీ, తాజా రాజకీయ పరిణామాలు సహా పలు అంశాలపై చర్చ




**విజయవాడ, మహా:** పేద, అణగారిన వర్గాలకు పెద్దపీట వేసేలా మోదీ పాలన ఉండిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. గత 11 సంవత్సరాల్లో భారతదేశం అనేక రంగాల్లో అసాధారణ పురోగతి సాధించిందని, ఈ అభివృద్ధి స్థిరమైన మోదీ నాయకత్వం ఉండటంవల్లే సాధ్యమైందని అన్నారు. విజయవాడలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన "మోడీ ప్రభుత్వం 11 ఏళ్ల అభివృద్ధి" కార్యక్రమాలపై పుస్తకాన్ని విడుదల చేశారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గత 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం మీద ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని, ఇది దేశ ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. పేద, అణగారిన వర్గాలకు పెద్దపీట వేసేలా మోదీ పాలన ఉండిందని అన్నారు. రైతులు, యువత, మహిళలు ఈ నాలుగు ప్రధాన విభాగాల అభివృద్ధి కోసమే ప్రతి కార్యక్రమం రూపకల్పన చేశారని అన్నారు. భారతదేశం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, ఇటీవలే 4 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీగా మారిందని తెలిపారు. పన్నుల వ్యవస్థలో సమగ్ర మార్పులు చేసి, జీఎస్టీ ద్వారా "వన్ నేషన్ వన్ ట్యాక్స్" లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. 2014లో 6.91 కోట్ల పన్నులు కట్టే వారు ఉండగా, ఇప్పుడు 15.66 కోట్లకు పెరిగిందని వివరించారు.

**జీరో టాలరెన్స్ పాలసీ..**

అలాగే మోదీ ప్రభుత్వం రైతుల కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని తెలుపుతూ.. వ్యవసాయ బడ్జెట్ 25,633 కోట్ల నుంచి 1.33 లక్షల కోట్లకు పెరిగిందని, 82 శాతం వరకు గిట్టుబాటు ధరలు పెరిగినట్లు వెల్లడించారు. 11 కోట్ల మంది రైతులకు " కిసాన్ సమ్మాన్ నిధి " ద్వారా ఏటా నేరుగా రైతు అకౌంట్ లోకి నగదు అందిస్తామని అన్నారు. అలాగే ఉగ్రవాదం విషయంలో జీరో టాలరెన్స్ పాలసీ అనుసరిస్తున్నామని చెప్పారు. పఠాన్ కోట్ సర్జికల్ స్ట్రైక్, పహల్గావ్ దాడి, ఆపరేషన్ సింధూర్ వంటి చర్యలు భారత్ శక్తిని చాటిచెప్పినట్టు పేర్కొన్నారు. బ్రహ్మోస్, బ్రహ్మాస్త్రం వంటి సామర్థ్యాలు దేశ రక్షణను మరింత బలంగా తీర్చిదిద్దాయని అన్నారు. దేశంలో అమృత్ భారత్ పథకం కింద 1300 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తుండగా.. 1.46 లక్షల కి.మీ. జాతీయ రహదారులు, 7.7 లక్షల కిమీ గ్రామీణ రహదారులు నిర్మించామని చెప్పారు కిషన్ రెడ్డి. రైల్వే బడ్జెట్ 29,056 కోట్ల నుంచి 2.42 లక్షల కోట్లకు పెరిగిందని, 136 వందే భారత్ రైళ్లు ప్రారంభించామని వివరించారు. ఇక ఉడాన్ స్కీం ద్వారా సామాన్యులకూ విమానయానాన్ని అందుబాటులోకి తెచ్చామని, 2014లో 71 విమానాశ్రయాలు ఉండగా.. ఇప్పుడు 159కి పెరిగినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 26 ఎఐఐఎంఎస్ ఆసుపత్రులు ఇప్పటికే పనిచేస్తుండగా, మరో 15 నిర్మాణంలో ఉన్నాయని కిషన్ రెడ్డి తెలిపారు.

## చంద్రబాబుతో భేటీ



విజయవాడ పర్యటకు వెళ్లిన కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.. టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. చంద్రబాబు నివాసంలో జరిగిన ఈ లంచ్ మీటింగ్‌లో పలు అంశాలపై చర్చించారు. ఆ తర్వాత చంద్రబాబు నివాసం నుంచి విజయవాడ బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. విజయవాడ వచ్చినందుకు సీఎం చంద్రబాబు లంచ్ కి పిలిచారని తెలిపారు.. కేంద్ర సహాయం, ఏపీకి రావాల్సిన ప్రాజెక్ట్ లపై చర్చించామని వెల్లడించారు.. ఇక, విజయవాడ పర్యటనకు వచ్చినందుకు మర్యాద పూర్వకంగా కలవడానికి సీఎం చంద్రబాబు పిలిచారని తెలిపారు.. మైనింగ్, ఇతర ప్రాజెక్ట్ లపై ఈ లంచ్ సమావేశంలో చర్చించమన్నారు. వాటితో పాటు తాజా రాజకీయ పరిణామాలు, తెలంగాణ రాజకీయాలపై కొద్దిసేపు చర్చించినట్టు సమాచారం.

# సామాజిక న్యాయానికి కేరాఫ్ కాంగ్రెస్

పార్టీలో ఎవరికైనా అవకాశాలు దక్కుతాయి: భట్టి .. డిప్యూటీ సీఎం, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన కొత్త మంత్రులు







**మహా:** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన నూతన మంత్రులు, డిప్యూటీ స్పీకర్ కలిశారు. ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన కొత్త మంత్రులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. మంగళవారం హైదరాబాద్ ప్రజా భవన్‌లో భట్టి విక్రమార్కను వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, డిప్యూటీ స్పీకర్‌గా నియమితులైన రామచంద్రు నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క వారికి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు. అలాగే ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహని తన నివాసంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు అడ్లూరిని మంత్రి దామోదర అభినందించి, ఆశీర్వదించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి దామోదర ఈ సందర్భంగా సూచించారు. సామాజిక న్యాయానికి కేరాఫ్ కాంగ్రెస్ అని మంత్రి పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ, కుల గణన, బీసీల రిజర్వేషన్ల పెంపు, మంత్రి వర్గంలో నలుగురు ఎస్సీలకు స్థానం కల్పించడం, స్పీకర్‌గా అవకాశం ఇవ్వడం వంటి అంశాలను గుర్తు చేసుకున్నారు

## మాది మాటల ప్రభుత్వం కాదు

**మంత్రి శ్రీధర్ బాబు**

**మహా :** తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల్లో చూపించే ప్రభుత్వం అని ఐటీ శాఖా మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ ప్రతిభకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. పెట్టుబడుల విషయంలో ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేయొద్దని, తెలంగాణకు వచ్చే పెట్టుబడులు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త పరిశ్రమలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తోందని, తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు చూసి శైవ గ్రూప్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పుకుందని తెలిపారు. 18 నెలల్లో 3 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు కుదిరాయని, లక్ష మందికి తెలంగాణ యువతకు ఉపాధి లభించిందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. 'తెలంగాణ ప్రభుత్వం కొత్త పరిశ్రమలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు చూసి శైవ గ్రూప్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పుకుంది.13 వందల కోట్లతో బయోటెక్ సంస్థ పెట్టుబడులు పెడుతున్నారు. ఐదు సంస్థల్లో 2100 కోట్లు, 5 వేల మందికి ఉపాధి కలగనుంది. సాంకేతిక పరమైన కొత్త ఆవిష్కరణలకు ప్రభుత్వం పెట్టుబడి దారులకు సహకారం అందిస్తుంది. 18 నెలల్లో 3 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు, లక్ష మందికి తెలంగాణ యువతకు ఉపాధి లభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి అడుగు నుంచే విమర్శలు చేస్తున్నారు. మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల్లో చూపిస్తున్నాం' అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

# హైకోర్టులో హరీష్ రావుకు రిలీఫ్

ఎన్నికల పిటిషన్ డిస్మిస్

ఎన్నికపై హైకోర్టులో కేసు వేసిన చక్రధర్ గౌడ్

**మహా :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన గెలుపు చెల్లదంటూ బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి, ప్రస్తుతం కాంగ్రెస్ నేతగా ఉన్న జి. చక్రధర్ గౌడ్ దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. హరీష్ రావు తన ఎన్నికల అఫిడవిట్ లో తప్పుడు సమాచారాన్ని అందించారని, అందువల్ల అతని ఎన్నికపై అనర్హత వేటు వేయాలని చక్రధర్ గౌడ్ తన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై ఈ రోజు విచారణ జరిపిన హైకోర్టు పిటిషనర్ సమర్పించిన ఆధారాలు సరిపోవని నిర్ధారించింది. తగిన ఆధారాలు లేకపోవడంతో చక్రధర్ గౌడ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. గతంలోనూ హరీష్ రావుపై చక్రధర్ గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వ్యవహారం హైకోర్టు వరకు వెళ్లింది. హరీశ్ రావు తన ఫోన్‌ను ట్యాప్ చేయించారని, తప్పుడు కేసులు బనాయించారని, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు హరీశ్ ఆదేశాల మేరకు స్టేట్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) పోలీసులు తన ఫోన్‌ను, తన కుటుంబ సభ్యుల ఫోన్‌లను ట్యాప్ చేశారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా సిద్దిపేటలో వార్ రూమ్ ఏర్పాటు చేసి పోలీస్ ఉన్నతాధికారులు ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, భుజంగ రావు వంటి వారు తన ఫోన్‌ను ట్యాప్ చేశారని ఆరోపించారు. చక్రధర్ గౌడ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో హరీశ్ రావు, మాజీ డీసీపీ రాధా కిషన్ రావుపై క్రిమినల్ కుట్ర, దోపిడీ, క్రిమినల్ నమ్మకద్రోహం, క్రిమినల్ బెదిరింపులు, ఐటీ చట్టంలోని సెక్షన్ 66 కింద కేసు నమోదు చేశారు. దీంతో హరీష్ రావు హైకోర్టును ఆశ్రయించారు. హరీశ్ రావును అరెస్టు చేయకుండా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, పోలీసులు దర్యాప్తును కొనసాగించవచ్చని, హరీశ్ రావు విచారణకు సహకరించాలని సూచించింది. విచారణ అనంతరం ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్ రావుపై నమోదైన క్రిమినల్ కేసును కూడా తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో ముందుకు సాగడానికి తగిన ఆధారాలు లేవని, ఫిర్యాదు రాజకీయ ప్రేరేపితమని, అసంబద్ధంగా ఉందని, ఫిర్యాదు దాఖలు చేయడంలో అసాధారణ జాప్యం జరిగిందని కోర్టు పేర్కొంది. బెదిరింపులు, అక్రమ నిఘా ఆరోపణలు విస్తృత రాజకీయ వైరుధ్యంలో భాగమని కోర్టు అభిప్రాయపడింది మొత్తంగా, చక్రధర్ గౌడ్ దాఖలు చేసిన ఫోన్ ట్యాపింగ్ కేసును గతంలోనే కొట్టేసిన హైకోర్టు తాజాగా ఎన్నికల పిటిషన్‌ను కూడా కొట్టేసింది.

## ఓఎంసీ కేసులో పిటిషన్లపై హైకోర్టులో విచారణ

విచారణ 17కు వాయిదా

**మహా :** ఓబులాపురం మైనింగ్ కేసులో దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. గాలి జనార్ధన్ రెడ్డి, ఓబుళాపురం మైనింగ్ కంపెనీ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్‌లపై విచారణ కొనసాగింది. నాంపల్లి సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని వీరు పిటిషన్లు వేశారు. సీబీఐ తరపున పీపీ శ్రీనివాస్ కపాడియా వాదనలు వినిపించారు. సీబీఐ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఇతర నిందితులూ పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై విచారణను కోర్టు జూన్ 17కు వాయిదా వేసింది.




## కేసీఆర్ కు నోటీసులు కాంగ్రెస్ కుట్రే

**బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి**

**మహా :** చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రం సాధించిన ఉద్యమ యోధుడు కేసీఆర్ కు ఇన్ని వేధింపులా? అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి మండిపడ్డారు. రాజకీయంగా కేసీఆర్ ను ఎదుర్కొనే దమ్ము లేకనే ఎలాంటి లోపాలు లేని కాళేశ్వరం ప్రాజెక్టుపై విషం కక్కుతూ ఆయనకు నోటీసులు జారీ చేయడం కాంగ్రెస్ కుట్రలో భాగమేనని ఆయన మంగళ వారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. కేసీఆర్ ను విచారణకు పిలవడాన్ని తెలంగాణ ప్రజలు బ్లాక్ డేగా పరిగణిస్తున్నారని జీవన్ రెడ్డి తెలిపారు. ఉద్యమ నేత, అభివృద్ధి, సంక్షేమ ప్రధాత కేసీఆర్ తో పెట్టుకున్నోళ్ళు ఎవరైనా మట్టి కొట్టుకుపోతరని ఆయన హెచ్చరించారు. గద్దెనెక్కిన తొలిరోజు నుంచే కక్ష సాధింపుల పర్వానికి తెరలేపిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదన్నారు. తనవి బీజేపీ, టీడీపీ మూలాలని రేవంతే స్వయంగా చెప్పుకున్నారని ఆయన గుర్తు చేశారు. రేవంత్ చదివిన మోడీ, చంద్రబాబు స్కూళ్లకు ఛీటింగ్ తప్ప రేటింగ్ లేదని ఎద్దేవా చేశారు. అవి కుసంస్కార స్కూళ్ళు కాబట్టే రేవంత్ రెడ్డి చెడి పోయిండన్నారు. అందుకే ఆయన ఫిరాయింపులు, పేమెంట్ కోటాలో రాహుల్ గాంధీ వద్ద ముఖ్యమంత్రి ఉద్యోగం సంపాదించుకొని తెలంగాణను దోపిడీ చేస్తూ డిల్లీకి డబ్బు మూటలు మోస్తున్నారని జీవన్ రెడ్డి ఆరోపించారు. ఈడీ కేసులో రేవంత్ కు మోడీ రక్షణ అని, కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టును చేసి బాబుకు గురుదక్షిణగా ఇస్తున్నారని, కాంగ్రెస్ అధిష్టానానికి తన అసలు రంగు తెలియడంతో పదవి కాపాడుకునేందుకు రాహుల్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ ఇచ్చి తీరాలని తొడగొట్టిన మొనగాడు కేసీఆర్ అని, కేసీఆర్ అనే మేరు పర్వతాన్నే ఢీకొట్టే దమ్ముందా?అని మండిపడ్డారు. హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న డైవర్షన్ పోలిటిక్స్ తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ కుటిలత్వంపై తెలంగాణ ప్రజల్లో ఆగ్రహ జ్వాలాలు వ్యక్తమవుతున్నా యని ఆయన చెప్పారు. కేసులకు, విచారణలకు భయపడమని ,హామీల అమలుకు చివరి వరకు ప్రజల పక్షాన పోరాడుతామని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

# రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే కార్యక్రమం

రికార్డ్ స్థాయిలో డిమాండ్ పెరిగినా అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసాం

రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ శాఖ అగ్రస్థానంలో ఉండాలి

బ్యాంక్ డైరెక్టర్ గా ఎడ్యుకేషన్ లోన్, కిసాన్ కార్డుల జారీ మధుర ఘట్టం..డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**మహా :** రాష్ట్ర, దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న 50 వేల మంది విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా పథకం కోసం బ్యాంకర్లతో ఒప్పందం చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే కార్యక్రమం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన ప్రజాభవన్ లో విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా బ్యాంకర్లతో ఒప్పందం అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. ప్రజల కోసం పనిచేసే సంస్థల్లో విద్యుత్ సంస్థ ప్రధానమైనది ఆ సంస్థలో పనిచేసే సిబ్బంది కుటుంబాల గురించి వారి యోగ క్షేమాల గురించి ఆలోచించి తీసుకున్న ఈ ప్రమాద బీమా పథకం వ్యక్తిగతంగా తనకు బాగా తృప్తిని ఇచ్చిందని తెలిపారు. విద్యుత్ శాఖలో పని చేసే ఉద్యోగులు రాత్రి, పగలు అని తేడా లేకుండా శ్రమిస్తారు, ప్రకృతి వైపరీత్యాలకు ప్రాణాలు అడ్డం పెట్టి విధుల్లో నిమగ్నమవుతారు అందుకే వారి కుటుంబాల యోగక్షేమాల కోసం ఈ ప్రమాద బీమా పథకాన్ని తీసుకువచ్చాం అన్నారు.

రాష్ట్ర జీడీపీ పెరుగుదలకు ఇందనంగా ఉపయోగపడే ప్రధాన విద్యుత్ శాఖ అని తెలిపారు. లైన్ మెన్ మొదలు సీఎండీ స్థాయి వరకు పనిచేసే ఉద్యోగులందరికీ కుటుంబాలుంటాయి హోదాలు వేరైనా కుటుంబం విషయానికి వచ్చేసరికి ఒకే రకమైన బంధం అనుబంధం, బాధ్యత ఉంటుందని తెలిపారు. విద్యుత్తు సిబ్బందిలో నమ్మకం, ధైర్యాన్ని ఇవ్వడం కోసం ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేకుండా ఈ పథకాన్ని తీసుకువచ్చామని, దీని ద్వారా ఉద్యోగుల్లో మనోధైర్యం పెరుగుతుంది ప్రభుత్వంపైన నమ్మకం కలుగుతుంది ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం మా బాధ్యతగా భావిస్తున్నానని డిప్యూటీ సీఎం తెలిపారు. ఎస్ బీఐలో ఖాతా తెరిచిన విద్యుత్ ఉద్యోగులకు కేవలం ప్రమాద బీమానే కాకుండా పెళ్లి, విద్యాపరమైన ఆర్థిక సహాయంలోను రుణాలు అందించి చేయూతను ఇవ్వనున్నారని తెలిపారు. శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి 80 లక్షల పరిహారం అందుతుందని తెలిపారు. సహజ మరణం చెందితే పది లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుందని, ఉద్యోగితోపాటు నలుగురు కుటుంబ సభ్యులకు కలిపి 20 లక్షల వరకు బీమా సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కిందిస్థాయి ఉద్యోగం నుంచి సీఎండీ వరకు వర్తించే ఈ పథకాన్ని తీసుకురావడం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వానికి తృప్తినిచ్చే కార్యక్రమం అన్నారు. 2023 తో పోలిస్తే 2025 లో పిక్ డిమాండ్ 17,162 మెగావాట్లు వచ్చింది గతంతో పోలిస్తే 2000 మెగావాట్ల డిమాండ్ అదనంగా పెరిగిన విద్యుత్ సరఫరా లో చిన్న అంతరాయం లేకుండా రాష్ట్ర విద్యుత్ సిబ్బంది చూసుకున్నారని ఈ సందర్భంగా అందరికీ అభినందనలు తెలిపారు.

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ ను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ ఉత్పత్తి పెంచడంతోపాటు కాలుష్య రహిత గ్రీన్ ఎనర్జీని సమకూర్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలతో పనిచేస్తుందని వివరించారు. గత పది సంవత్సరాలు ప్రత్యేక విద్యుత్ పాలసీ లేకపోవడంతో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వెనుకబడిపోయామని వివరించారు. ఈ లోటును గుర్తించి ప్రభుత్వం ఏర్పడగానే 2025 న్యూ గ్రీన్ ఎనర్జీ పాలసీని తీసుకువచ్చాం, రాష్ట్రంలోని ఓనర్ లోని వాడుకోవడమే కాకుండా దేశవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ వనరుల సమీకరణకు ప్రయత్నం చేస్తున్నాం 2030 నాటికి 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు. ఒకవైపు ఉత్పత్తి పెంచుకుంటూనే సరఫరాలో 75% టార్గెట్ కు చేరుకోగానే సరఫరా వ్యవస్థను అప్డేట్ చేసుకుంటూ ముందుకు పోతున్నామని అందుకే అదనంగా రెండు వేల మెగావాట్ల పిక్ డిమాండ్ వచ్చినప్పటికీ రాష్ట్రంలో రెప్పపాటు అంతరాయం లేకుండా ఈ వేసవిలో విద్యుత్ సరఫరా జరిగిందని డిప్యూటీ సీఎం వివరించారు. ఈ పథకం ద్వారా విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలు ధైర్యంగా, నమ్మకంగా, భరోసాతో ముందుకు పోతాయన్న విశ్వాసాన్ని డిప్యూటీ సీఎం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ శాఖ అగ్రస్థానంలో ఉండాలని సిబ్బంది ఈ లక్ష్యసాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంధన శాఖ సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాన్ని చీల్చేందుకు బీజేపీ కుట్ర!

మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు

రాజ్యాంగాన్ని మార్చేందుకు కూడా కేంద్రం ప్రయత్నిస్తోంది

యుద్ధం చేయమంటే ట్రంప్ సూచనతో మోదీ వెంటనే వెనక్కి తగ్గారు

బీజేపీపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్



**మహా:** రాజకీయ స్వలాభం కోసం బీజేపీ మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించారని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని, మనుస్మృతిని అమలు చేయాలనే కుట్రలో బిజేపీ నాయకత్వం ఉన్నదని ధ్వజమెత్తారు. "జై బాపు - జై భీమ్ - జై సంవిధాన్" పేరిట దేశవ్యాప్తంగా కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. దేశ సమగ్రత, అఖండతకు ముప్పు వాటిల్లేలా మోడీ, అమిత్ షా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికారమే ధ్యేయంగా, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కేలా బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని చీల్చేందుకు కుట్రలు పన్నుతోన్న దుష్కర్తులను ప్రజల శక్తితో ఎదుర్కోవాలంటూ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పిలుపు మేరకు రాష్ట్రం నుండి దేశ రాజధాని ఢిల్లీ వరకూ ఉద్యమాలు సాగుతాయని తెలిపారు.

**సామాజిక సమానత్వానికి పెద్దపీట..**

పది ఏళ్ల పాలన తరువాత కూడా అభివృద్ధిపై చెప్పుకోదగినది ఏమీ లేదని మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. ఎన్నికల్లో 400 సీట్లు వస్తాయని ఊహించుకున్న బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా దేశాన్ని భిన్న కోణాల్లో అధ్యయనం చేయగలిగారని గౌడ్ తెలిపారు. సామాజిక న్యాయం కోసం కులసర్వేను రాహుల్ ప్రారంభించారని, తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి దానిని విజయవంతంగా పూర్తి చేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పీసీసీ కార్యవర్గంలో 70 శాతం స్థానాలు ఇచ్చామని, సామాజిక సమానత్వానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. అంతేకాక, ప్రధాని మోడీపై తీవ్ర విమర్శలు చేస్తూ.. ఆయనకు ప్రధాని పదవి మీద ఆసక్తి ఉండొచ్చునేమో కానీ దేశప్రేమ ఉండదని ఎద్దేవా చేశారు. ఒకపక్క పాకిస్తాన్‌పై యుద్ధం చేయమంటూ ఘంటాపథంగా మాట్లాడుతారు, కానీ ట్రంప్ సూచనతో వెంటనే వెనక్కి తగ్గతారని వ్యాఖ్యానించారు. 92 వేల మంది పాకిస్తానీ సైనికులను చేతిలో పెట్టిన గొప్ప నాయకత్వం ఇందిరా గాంధీదేనని గుర్తుచేశారు.

# ఆర్సీబీ ఫర్ సేల్?

**మహా:** ఫస్ట్ టైం ఐపీఎల్ 2025లో ఆర్సీబీ జట్టు విజేతగా నిలిచింది. 18 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలికి తొలిసారి టైటిల్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఆ టీమ్ విన్నింగ్ సెలబ్రేషన్స్ లో తొక్కిసలాటతో 11 మంది చనిపోయారు. ఇప్పుడేమో ఆ టీమ్ ను అమ్మేయాలని ఓనర్స్ అనుకుంటున్నట్లు తెలుస్తోంది. 2025 టైటిల్ గెలుచుకున్న వారం తర్వాత ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫ్రాంఛైజీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) కొత్త యజమానులను వెతుకుతున్నట్లు తెలుస్తోంది. ఎన్డీటీవీ రిపోర్ట్ ప్రకారం.. ఫ్రాంఛైజీ ప్రస్తుత ఓనర్ డియాజియో పీఎల్ సీ సంస్థ పాక్షికంగా లేదా పూర్తిగా ఫ్రాంఛైజీని విక్రయించాలని చూస్తున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. జట్టు తన తొలి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత బ్రాండ్ సాధించిన గరిష్ట స్థాయి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

**2 బిలియన్ డాలర్లు..**

భారీ రేట్ ఆర్సీబీ వ్యవహారాలను ఇండియాలో డియాజియో ద్వారా యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ చూసుకుంటోంది. ఫ్రాంఛైజీ అమ్మకంపై ఇది ఇప్పటికే పెట్టుబడిదారులతో చర్చలు జరుపుతోంది. ఫ్రాంఛైజీ విలువపై ఇంకా అధికారిక సమాచారం లేనప్పటికీ, పూర్తి అమ్మకానికి యజమానులు 2 బిలియన్ అమెరికా డాలర్లు (సుమారు రూ. 16,834 కోట్లు) వరకు డిమాండ్ చేయవచ్చని బ్లూమ్‌బెర్గ్ వెల్లడించింది. డబ్బు కోసం బ్రిటిష్ డిస్టిలర్, యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ మాతృ సంస్థ అయిన డియాజియో పిఎల్‌సి.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరులో పాక్షిక లేదా పూర్తి వాటాను విక్రయించడానికి చూస్తోందని సమాచారం. ఇటీవల టైటిల్ గెలుచుకున్న తర్వాత ఈ మద్యం విక్రయ దిగ్గజ కంపెనీ.. ఐపీఎల్ ఫ్రాంఛైజీని అమ్మి డబ్బు ఆర్జించే మార్గాలను అన్వేషిస్తోందని తెలిసింది. ఆర్సీబీ అమ్మకం వార్త వెలువడగానే యునైటెడ్ స్పిరిట్స్ షేర్ల ధరలు మంగళవారం (జూన్ 10) ఉదయం 3.3% వరకు పెరిగాయి. అయితే, ఫ్రాంఛైజీని విక్రయించాలా వద్దా అనేదానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.



ANN తెలుగు
మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్
11-06-2025
WWW.MAHAADAILY.COM





జనాభా పెరుగుదలలో భారత్ ప్రపంచంలోనే నెంబర్ వన్ ర్యాంకును కొనసాగిస్తోంది. ఈ ఏడాది కూడా జనాభాపరంగా ప్రపంచంలోనే నంబర్ 1 స్థానంలో భారత్ కొనసాగుతోంది. ఐరాస అనుబంధ సంస్థ ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ పేర్కొంది. ఈ ఏడాది చివరికల్లా జనాభా 146 కోట్లకు చేరుకుంటుదని అంచనా వేసింది. స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ పేరుతో విడుదల చేసిన నివేదికలో ఈ మేరకు తెలిపింది. అయితే జననాల రేటు నిర్దేశిత స్థాయి కంటే దిగువకు పడిపోయిందని వెల్లడించింది. భారత్‌లో సంతానోత్పత్తి ప్రధాన సమస్యగా ఉందని వివరించింది. - మహా, ప్రత్యేక కథనం

# భారత్ జనాభా @ 146 కోట్లు

## ప్రపంచంలో నంబర్ వన్

## తగ్గిన సంతానోత్పత్తి.. మరో 40 ఏళ్ళలో 170 కోట్లు

### ఐరాస నివేదికలోని అంశాలివీ

భారత్‌లోని 68 శాతం జనాభా 15 నుంచి 64 ఏళ్లలోపు వయో వర్గానికి చెందినది. ఇది వర్కింగ్ ఏజ్ గ్రూప్.

అత్యధిక జనాభా వర్కింగ్ ఏజ్ గ్రూప్‌లో ఉండటం అనేది భారత్‌కు కలిసొచ్చే అంశం. వర్కింగ్ ఏజ్‌లోని వారికి తగినన్ని ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ విధానపరమైన మద్దతు లభిస్తే భారత్ ఆర్థికంగా మంచి పురోగతిని సాధిస్తుంది.

భారత జనాభాలో 10-24 ఏళ్లలోపు వారు 26శాతం, 0-14 ఏళ్లలోపు వారు 24శాతం, 10-19 ఏళ్లలోపు వారు 17 శాతం మంది ఉన్నారు.

65 ఏళ్లకుపైబడిన వారు భారత్‌లో కేవలం 7 శాతం మందే ఉన్నారు.

ప్రజల ఆయుర్దాయాలు పెరుగుతున్నందున రాబోయే కొన్ని దశాబ్దాల్లో 65 ఏళ్లకుపైబడిన వయో వర్గంలోని వృద్ధుల సంఖ్య మరింత పెరగొచ్చు.

2025 నాటికి భారత దేశంలోని పురుషుల సగటు ఆయుర్దాయం 71 ఏళ్లుగా, మహిళల సగటు ఆయుర్దాయం 74 ఏళ్లుగా ఉంది.

ప్రపంచ దేశాల్లో సంతానోత్పత్తి సంక్షోభం

ప్రపంచ దేశాల్లో సంతానోత్పత్తి సంక్షోభం ఏర్పడిందని ఐరాస ఆందోళన వ్యక్తం చేసింది. కుటుంబ నియంత్రణ చర్యలు, గర్భనిరోధక సాధనాల వినియోగం, లైంగిక ఆరోగ్యం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఎవరికి వారుగా సంతానోత్పత్తి నిర్ణయాలను తీసుకోవాలని నివేదికలో పేర్కొంది. ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు వారి వ్యక్తిగత సంతానోత్పత్తి లక్ష్యాలను గుర్తించలేకపోయారని, జనాభా అంశంలో ప్రస్తుతానికి ఇదే నిజమైన సంక్షోభమని అని ఐరాస హెచ్చరించింది.

### భారతీయ మహిళలకు పెరిగిన అవగాహన

1970వ దశకం నాటికి భారతీయ మహిళల సగటు సంతానోత్పత్తి రేటు ఐదుగురు పిల్లలని, కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయిందని యూఎన్ఎఫ్ భారత విభాగం ప్రతినిధి ఆండ్రియా ఎం వోజ్నర్ తెలిపారు. 'భారత ప్రభుత్వం చొరవ వల్ల మహిళల్లో అన్ని రకాల అవగాహన పెరిగింది. ఇప్పుడు భారతీయ మహిళలు సగటున ఇద్దరు పిల్లలకే జన్మనిస్తున్నారు. ప్రెగ్నెన్సీ సమయంలో సంభవించే మహిళల మరణాలు తగ్గిపోయాయి. అయితే ఈవిషయంలో భారత్‌లోని వివిధ రాష్ట్రాలు, కులాలు, ఆదాయ వర్గాల్లో తేడాలున్నాయి. సంతానం ఎంతమంది ఉండాలనే దానిపై స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది. సంతానోత్పత్తిలో ప్రజలకు స్వేచ్ఛను కల్పిస్తూ, ఆర్థిక ఉన్నతిని సాధించే గొప్ప అవకాశం భారత్ ఎదుట ఉంది' ఆండ్రియా పేర్కొన్నారు.

### 40 ఏళ్ల తర్వాత తగ్గుముఖం

ఐరాస నివేదిక ప్రకారం ప్రస్తుతం భారత్‌లో జననాల రేటు 1.9గా ఉంది. ఏ దేశంలోనైనా సగటు 'రీప్లేస్‌మెంట్ రేటు' కనీసం 2.1గా ఉండాలి. కానీ, భారత్‌లో సంతానోత్పత్తి రేటు పడిపోయింది. జననాల రేటు తగ్గిపోయినప్పటికీ భారతదేశ జనాభా సంఖ్య నిలకడగా కొనసాగుతోందని ఐరాస కితాబిచ్చింది. ప్రస్తుతం భారతదేశ జనాభా 146 కోట్ల దరిదాపుల్లో ఉంది. రాబోయే 40 ఏళ్లలో భారత జనాభా 170 కోట్ల గరిష్ఠ స్థాయికి చేరొచ్చు. ఆ తర్వాతి నుంచి జనాభా తగ్గుదల మొదలయ్యే అవకాశం ఉందని ఐరాస విశ్లేషించింది.

# చదువు సారెడు.. ఫీజులు బారెడు

**ప్రైవేట్ కాలేజీల్లో ఆకాశాన్నంటిన ఇంటర్ ఫీజులు**
**పేద మధ్యతరగతి తల్లిదండ్రులకు తప్పని ఫీజుల భారం**
**డే స్కాలర్లకు రూ 40వేల నుంచి లక్ష**
**రెసిడెన్షియల్ రూ.లక్ష నుంచి 2లక్షలు వసూలు**
**ఏటా ఫీజులు పెంచుతున్న పట్టించుకోని సంబంధిత అధికారులు**
**ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలు**

**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మహానగరంలో ప్రతి ఏటా కార్పోరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కి విద్యా సంవత్సరం జూన్ నెల రాగానే వారి ఇష్టానుసారం వారి వారి విద్యాసంస్థల పేరిట పంప్లేట్లు తయారుచేసి విచ్చలవిడిగా వేలల్లో ఫీజులను పెంచుతూ పేద మధ్యతరగతి ప్రజల పై భారం మోపుతూ చదువు సారెడు.. ఫీజులు బారెడు అన్నట్టుగా ప్రైవేటు విద్యాసంస్థల యజమాన్యం ఆనందం పొందుతున్నారు. ఇన్ని జరుగుతున్న విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం పట్ల ప్రజా సంఘాలు, విద్యా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. అనుమతులు లేకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న అకాడమీల పేరుతో కళాశాలల ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు కళాశాల యజమాన్యాలపై పలు విద్యార్థి సంఘాల నాయకులు విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేస్తున్నప్పటికీ వారు పట్టించుకోవడంలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కళాశాలలు అకాడమీలు ఇంటర్మిడియేట్ మొదటి, ద్వితీయ సంవత్సరం తరగతులు 2 తేదీ నుంచే ప్రారంభించారు. కొన్ని ప్రయివేట్, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు ఈ సంవత్సరం వారి ఇష్టానుసారం ఫీజులు పెంచినట్లు ఆ పెంచిన ఫీజుల వసూలుకు సిద్ధమవుతున్నాయి. పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ కీలకం. ఉన్నత చదువులకు ఇది పునాది. ఈ నేపథ్యంలో తమ పిల్లలను మంచి కాలేజీల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. పదో తరగతి వరకు ప్రభుత్వ స్కూల్లో చదివించిన వారు కూడా ప్రయివేట్, కార్పొరేట్ కాలే జీల్లో చేర్పించేందుకు మొగ్గుచూపుతుండడం గమనార్హం. వరంగల్, హనుమకొండలోని ప్రయివేట్, కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్ చదివేందుకు ఉమ్మడి వరంగల్ లోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. దీన్ని అవకాశంగా తీసుకొని ఆయా జూనియర్ కాలేజీల యాజమాన్యాలు యథేచ్ఛగా ఫీజులు వసూలు చేస్తున్నారు. అడ్డూ అదుపు లేకుండా అమాయక తల్లిదండ్రుల నుంచి ఫీజులను దండుకుంటున్నారు. వివిధ ఆకర్షణీయమైన గ్రూపులు, సెక్షన్ల పేరిట వరంగల్, హనుమకొండలో డే స్కాలర్కు రూ.40 వేల నుంచి రూ.1 లక్ష వరకు కూడా వసూలు చేస్తున్న కాలేజీలు నగరంలో అనేకం ఉన్నాయి. రెసిడెన్సియల్ విద్యార్థులకు రూ. 1లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. తమ పిల్లలకు మంచి చదువులు చదివించాలనే ఆశతో పేద మధ్య తరగతి తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారు. గత విద్యాసంవత్సరం కంటే ఈ విద్యాసంవత్సరం ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల యజమాన్యాలు 20 నుంచి 30 శాతం ఫీజులు పెంచడం గమనార్హం. ఏసీ, నాన్ ఏసీ క్యాంపస్ల పేరిట, నీట్, ఐఐటీ, జేఈఈ మెయిన్స్, పలు కోర్సుల పేరిట ఫీజులు వసూలు చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఇంటర్ విద్యార్థులకు ఇంటర్ బోర్డు దాదాపు రూ.1,762 ట్యూషన్ ఫీజుగా నిర్ణయించింది. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదు. కాగా ఆయా ప్రయివేట్ కాలేజీల్లో చదు వుతున్న విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 60కి మించి ఉండడం లేదన్న ఆరోపణలున్నాయి.

**అఫిలియేషన్ లేకున్నా అడ్మిషన్లు**

ఇంటర్ విద్య సంవత్సరం ప్రారంభం కాబోతున్నప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రైవేట్, కార్పొ రేట్ కాలేజీలకు ఇంటర్మీడియట్ అఫిలియేషన్ లభించ కపోవడం గమనార్హం. హనుమకొండ జిల్లాలో దాదాపు 90కిపైగా ప్రయివేట్, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు ఉండగా, వరంగల్ జిల్లాలో 14 ఉన్నాయి. అయినప్పటికీ అడ్మిషన్లు నిర్వహిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. అయితే నిబంధనల ప్రకారం ఇంటర్ బోర్డుకు సమర్పించాల్సిన పత్రాలు సరిగ్గా ఇవ్వకపోవడమే ఆఫీలియేషన్ రాకపోవడానికి కారణమని తెలుస్తోంది. గడువు పూర్తి అవుతున్నా కాలయాపన చేస్తున్నారని సమాచారం. అయితే అఫిలియేషన్ రానప్పటికీ ఆయా ప్రయివేట్, కార్పొరేట్ కాలేజీ లు ఇప్పటికే అడ్మిషన్లను పూర్తి చేస్తు న్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత ఇంటర్ అధికారులు అటువైపు చూడడం లేదని, ఆయా జిల్లాల కలెక్టర్లు పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ అఫీలియేషన్ రాకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెబుతున్నారు.

**తరగతుల్లో కూర్చోవాలంటే..**

ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి కానీ ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే పలు కాలేజీ లు పీఆర్వో లను నియమించుకొని ఇప్పటికే అడ్మిషన్లు పూర్తి చేశారు. అడ్మిషన్ తీసుకునే సందర్భంలోనే రిజిస్ట్రేషన్ పేరిట రూ.3 వేల నుంచి రూ.7 వేలు వసూలు చేశారు. కాగా డే స్కాలర్ తరగతులను ప్రారంభించనుండగా, ఈ వారంలో రెసిడెన్సియల్ తరగతు లను ప్రారంభించే యోచనలో ఉన్నారు. ఆయా కాలే జీల అడ్మిషన్ ఫామ్ ప్రకారం మొత్తం ఫీజులో 30శాతం ఫీజును ముందే కట్టాలని తల్లిదండ్రులకు సూచిస్తుండడం గమనార్హం.

**నిబంధనలు పాటించని కాలేజీలపై చర్యలేవి**

ఇంటర్ కాలేజీ లలో ఒక కాలేజీ పర్మి షన్ తీసుకొని దాని పేరిట రెండు, మూడు బ్రాంచిలు నడుపుతున్నారు. విద్యార్థుల తల్లి దండ్రులకు మాయమాటలు చెప్పి అడ్మిషన్లు చేయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడి పిస్తున్న కాలేజీలను గుర్తించి మూసివేయాలి. ప్రభుత్వ గుర్తింపు లేని కళాశాలల వివరాలను అధికారులు వెల్లడించాలి. అర్హులైన ఫ్యాకల్టీ లేకున్నా కాలేజీలను నడుపుతున్నారు. అటు వంటి కాలేజీలను మూసివేయాలి. అధిక ఫీజులు వసూలు చేసే కాలేజీ లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**అకాడమీల పేరిట లక్షల్లో ఫీజులు వసూళ్లు**

ఐఐటీ, నీట్, అకాడ మీల పేరిట ఆయా కళాశాల యాజమాన్యాలు రూ. 1 నుంచి రూ. 3 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. నగరంలో పదుల సంఖ్యలో అకాడమీలు ఉన్నాయి. 200 నుంచి 400 గజాలు కూడా లేని భవనాల్లో విద్యార్థులకు నిబంధనలకు విరుద్ధంగా 3, 4 అంతస్తుల్లో తరగతులు నిర్వహిస్తు న్నారు. ఇంత జరుగుతున్న అధికారులు అటువైపు చూడటం లేదు. ఫీజులను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. విద్యార్థులకు తల్లిదండ్రులకు అందుబాటులో ఫీజులు ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకుల తో పాటు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## పీడీఎస్ ప్రయోజనాలు ప్రజలకు అందేలా చూడాలి

**రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్**



**కాటారం, మహా :** నిత్యావసర వస్తువుల పంపిణీలో పారదర్శకత మరియు జవాబుదారీతనం ఉండాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం కాటారం మండలం లోని గారెపల్లి, ధన్వాడ గ్రామాల్లో చౌక ధరల దుకాణాలు ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగాఅదనపు కలెక్టర్ స్టాక్ పరిశీలించి లబ్ధిదారులతో సంభాషించారు. చౌక ధరల దుకాణాలు సమర్థవంతంగా పనిచేయాలని లబ్ధిదారులు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువుల పంపిణీ జరగాలని ఆయన ఆదేశించారు. లబ్ధిదారులు లేవనెత్తిన ఏవైనాసమస్యలు లేదా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. చౌక దుకాణాల పనితీరును పర్యవేక్షించడం మరియు పిడీఎస్ ప్రయోజనాలు పారదర్శకంగా మరియు సమర్థవంతంగా ఉద్దేశించిన లబ్ధిదారులకు చేరేలా చూడటం కోసం నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. భూ భారతి 2025 రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో భాగంగా కాటారం మండలంలోని గారెపల్లి గ్రామంలో తిరుగుతున్న రెవెన్యూ సదస్సును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడి భూ సంబంధిత సమస్యలను తెలుసుకున్నారు. భూ నమోదులు, రికార్డులు సర్దుబాటు, వాస్తవికంగా భూములపై ఉన్న హక్కుల విషయాల్లో ప్రజలకు అవగాహన కల్పించి, సంబంధిత రెవెన్యూ అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాద్ తహసీల్దార్ నాగరాజు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు



**కరీంనగర్, మహా:** బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ జన్మదినన్ను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ లోని వృద్ధుల ఆశ్రమంలో బీసీ సంక్షేమ మరియు అనుబంధ సంఘాల నాయకులు జాజుల జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు వృద్ధులకు పండ్లు మరియు బ్రెడ్ పంపినిచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రీనివాస్ గౌడ్ తన పోరాటాలతో బీసీ విద్యార్థులకు బోధన రుసుము తోపాటు సంక్షేమ వసతి గృహాలు ఏర్పాటుకు కృషిచేశారు. రాష్ట్రప్రభుత్వం బీసీ కూలజన చేసేలా పోరాటం చేశారని అన్నారు. అలాగే జనాభా దామాషా ప్రకారం చట్ట సభల్లో బీసీల ప్రతినిత్యం కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నారని తెలిపారు. అందరి ఆదరాభిమానాలతో వారు నేడు నూరేళ్ళు జీవించి బీసీల హక్కులపై పోరాటం చేస్తూ చట్ట సభల్లో అడుగు పెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు కాయితోజు బ్రహ్మచారి, మంతెన కిరణ్,బీసీ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, కుసుంబ ఆదర్శ్ మరియు బీసీ సంక్షేమ అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## సీపీని మర్యాద పూర్వకంగా కలిసిన మిల్స్ కాలనీ ఇన్స్ స్పెక్టర్




**వరంగల్ మహా:** వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ కు నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బొల్లం రమేశ్ మంగళవారం వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా సీపీ పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్ఠలు పెంచేలా విధులు నిర్వహించి, ప్రజల మన్ననలు పొందాలని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సీఐకి సీపీ సూచించారు.

## కదిలిన రాజ్యాంగ రథం.. ప్రతి అడుగు అద్భుతం..!

**షాద్ నగర్ లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ కు అడుగడుగున ఘన స్వాగతం..**

భారీ ర్యాలీతో ఈడెన్ గార్డెన్ కు కదిలిన కాంగ్రెస్ బృందం..
షాద్ నగర్ లో ఆద్యంతం ఆకట్టుకున్న కార్యక్రమం..



**షాద్ నగర్, మహా:** సామాజిక మాధ్యమాలు తెరిస్తే చాలు.. బాపుజీ పై అడ్డగోలు విమర్శలు.. పండిత్ నెహ్రూపై ఆరోపణలు.. చివరికి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను వదలని ఫేక్ మీడియాలు.. ఇలాంటి దశలో అలాంటి దుష్ప్రచారాలను తిప్పికొట్టాలన్న సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జై బాపూ.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం విజయవంతమైంది. గత కొద్ది రోజులుగా గ్రామీణ ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు తిరుగుతూ బాపు ఆశయాలను గ్రామాలలో ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా ఫేక్ మీడియా ద్వారా బిజెపి చేస్తున్న కుతంత్రాలను ప్రజలకు అర్థం చేసి చెప్తున్నారు. ఈ కార్యక్రమానికి మరింత ఊపు తేవడంలో భాగంగా పట్టణంలోని ఈడెన్ గార్డెన్ లో ఇదే కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ రావలసి ఉండగా అనివార్య కారణాల వల్ల రాలేదు. అయితే టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చారు. తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన ఆయనకు కాంగ్రెస్ నాయకులు అడుగడుగున స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో తిమ్మాపూర్, కొత్తూరు, నందిగామ ప్రాంతాలలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. షాద్ నగర్ క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకున్న ఆయనను భాజా భజంత్రీలు, బాణ సంచాల మధ్య ర్యాలీగా ఈడెన్ గార్డెన్ కు తీసుకు వెళ్లారు. అంతకుముందు పట్టణ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఇక్కడ పూర్తిస్థాయిలో విజయవంతం చేయడంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సక్సెస్ అయ్యారనే చెప్పాలి.

### ప్రయోజనం చేకూరుతుందా..?

నిజానికి ప్రస్తుత పరిస్థితుల్లో స్వాతంత్రం తెచ్చిన మహనీయులను కించపరుస్తున్న సామాజిక మాధ్యమాల పోస్టులు ఫేక్ వీడియోలు మన దేశాన్ని మనం చులకన చేసుకునేలా ఉన్నాయి. ఇది బిజెపి పనా, ఇంకెవరైనా చేస్తున్నారన్నది ఇక్కడ ప్రస్తుతం. కానీ విధానాలను విమర్శించకుండా వారి వ్యక్తిగత జీవితాలను విమర్శించడం, అందులో లేనివి జోప్పించడం విమర్శలకు దారితీస్తున్న అంశం. అయితే ఈ దుష్ప్రచారాలను తప్పని జనాలకు చాటి చెప్పే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమం చాలావరకు విజయవంతం అయిందని చెప్పాలి. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చాలా విషయాలు చెప్పారు. అలాగే కొత్తూరు మండలానికి చెందిన ముస్లిం మహిళ నుస్రత్ బేగం ప్రసంగం ఆకట్టుకుంది. ప్రస్తుత తరుణంలో కాంగ్రెస్ త్యాగాలకు సవాల్ గా మారిన ఇలాంటి వాటిని గట్టిగా చేదించగలిగితేనే పార్టీకి ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. మన దేశానికి స్వాతంత్రం తెచ్చిన నాయకుల ఉన్నతిని వారి గొప్పతనాన్ని కాపాడుకునే అవకాశం లభిస్తుంది. కాబట్టి ఈ కార్యక్రమాన్ని మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ప్రజల అభిప్రాయపడుతున్నారు.



## యుద్ధ ప్రాతిపదికన వాహనాల మరమ్మత్తులు జరగాలి

- నగర మేయర్ గుండు సుధారాణి
- వాహన షెడ్డు ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మేయర్

**వరంగల్ మహా;** యుద్ధప్రాతిపదికన వాహనాల మరమ్మత్తులు జరగాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. హన్మకొండలోని బాలసముద్రం లో నిర్వహిస్తున్న వెహికల్ షెడ్ ను మేయర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి చెత్త తరలింపు వాహన మరమ్మతులకు సంబంధించిన సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసుకొని వేగవంతంగా మరమ్మతులు చేపట్టుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ మరమ్మతులకు గురైన 41 స్వచ్ఛ ఆటోలు, 9 ట్రాక్టర్లు, 4 డంపర్ పెసర్లు, 4 జెసిబిలు, 2 హిటాచీలు, 4 కాంపాక్టర్ల కు వారంలోగా మరమ్మత్తులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని రిపేరింగ్ కోసం షో రూమ్ వెళ్లిన పెద్ద వాహనాల మరమ్మత్తుల స్థితిగతులను తెలుసుకొని త్వరితంగా పూర్తి చేసేలా చూడాలని అన్నారు. స్వచ్ఛ ఆటో లకు అమర్చిన మైకులు సరిగా పనిచేస్తున్నాయో లేవో పరిశీలించి అవసరం మేరకు రిపేర్లు చేయించి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కు సంబంధించిన కార్యక్రమాలను స్వచ్ఛ ఆటో మైకుల ద్వారా ప్రజలకు అవగాహన కలిగించేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల వ్యాప్తిని అరికట్టడానికి నగర వ్యాప్తం గా ఉన్న 66 డివిజన్ లలో ప్రణాళిక బద్ధంగా ఫాగింగ్ చేపట్టాలని మేయర్ సిఎం హెచ్ ఓ ను ఆదేశించారు.

## స్మార్ట్ సిటీ పనులను నిర్దిష్ట గడువుగా పూర్తి చేయండి

**బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే**



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలో చేపట్టిన స్మార్ట్ సిటీ పనులను నిర్దిష్ట గడువు లోగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగర పరిధిలోని భద్రకాళి బండ్ తో పాటు బి ఆర్ నగర్, మడికొండ, కడిపికొండ, గోకుల్ నగర్ ప్రెసిడెన్సీ స్కూల్, రాజాజీ నగర్ కల్వర్టు తదితర ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించి కొనసాగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని సమర్థవంతంగా పూర్తి చేయుటకు పలు సూచనలు చేశారు. బంధం చెరువు ప్రాంతంలోని రోడ్డు పనులు, సుబేదారి ప్రాంతంలోని డొమినోస్ వద్ద కొనసాగుతున్న అంతర్గత రోడ్డు నిర్మాణ పనులు, బి ఆర్ నగర్ లో స్మార్ట్ సిటీ అంతర్గత రోడ్ పనులను కడిపికొండ, మడికొండ ప్రాంతాలలో అంతర్గత రోడ్డు నిర్మాణ పనులను ములుగు రోడ్డు ప్రాంతం లో రోడ్డు నిర్మిత పనులు గోకుల్ నగర్ లో తిరుమల బార్ నుండి ప్రెసిడెన్సీ స్కూల్ వరకు రోడ్డు పనులను పరిశీలించారు.

## నకిలీ విత్తనాలు, పురుగు మందుల విక్రయాలపై సమాచారం ఇవ్వండి


**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందింతే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. వానాకాలం సాగు ప్రారంభమవుతున్న వేళను దృష్టిలో ఉంచుకుని రైతులు నకిలీ విత్తనాల బారీన పడకుండా ముందస్తు చర్యలకై పరంగల్ కమిషనరేట్ పోలీసులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు రూపొందించిన ప్రచార పోస్టర్లను మంగళవారం పోలీస్ కమిషనర్ అధికారులతో కలసి ఆవిష్కరించారు.ఈ నకిలీ విత్తనాల నియంత్రణకై వరంగల్ పోలీస్ కమిషనర్ ఓ ప్రకటన చేస్తూ ఎవరైన వ్యాపారస్థులు, సంస్థలు, వ్యక్తులు రైతన్నను మోసం చేస్తూ నకిలీ విత్తనాలను, పురుగు మందులు విక్రయిస్తున్న వారిపై పిడి యాక్ట్ క్రింద కేసు నమోదు చేయడం జరుగుతుందని, అలాగే నకిలీ విత్తనాలను విక్రయాలను నియంత్రియించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఇప్పటికే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం ఒక కోటి 23 లక్షల విలువ నకిలీ పురుగు మందులు, విత్తనాలతో పాటు పెద్ద ఎత్తున గడ్డి మందును స్వాధీనం చేసుకోవడం తో పాటు 14మంది నిందితులను అరెస్ట్ చేసి జైలుకు తరలించడం జరిగిందని తెలిపారు. ఇకపై ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే స్థానిక పోలీసులకు గాని లేదా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఫోన్ నంబర్ 7799848333 ఫోన్ నంబరకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీ లు జితేందర్ రెడ్డి, దేవిడ్ రాజు, ఇన్స్ స్పెక్టర్ విశ్వేశ్వర్ పాల్గొన్నారు.

## గత ప్రభుత్వం జీహెచ్ఎంసీ నిధులను కాళేశ్వరంకు మళ్లించింది నగర అభివృద్ధిని మరిచింది

**టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్..**



**ఎల్బీనగర్,మహా:** జిహెచ్ఎంసి నిధులను గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు మళ్లించి హైదరాబాద్ నగర ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా అన్యాయం చేసిందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ విమర్శించారు.ఎల్బీనగర్ మన్సూరాబాద్ డివిజన్ బాలాజీ నగర్ పార్కును ఆయన సందర్శించారు. మార్నింగ్ వాకర్స్ తో ఆయన మాట్లాడారు.పార్కులో రూ. 50 లక్షలతో వాచ్ మెన్ గది, టాయిలెట్స్, పిల్లల ఆట వస్తువులు, ఓపెన్ జిమ్ ను ఇటీవల మధుయాష్కీ మంజూరు చేయించి పనులు పూర్తి చేసినందుకు.. కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.డ్రైనేజీ ట్రంక్ లైన్ పనులను తొందరగా పూర్తి చేయించి సమస్యను తీర్చాలని ఈ సందర్భంగా పరిసర కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు మధుయాష్కీ కోరారు.స్పందించిన ఆయన జలమండలి డీజీఎం మాధవి ఫోన్లో మాట్లాడారు.పనులను వేగంగా పూర్తి చేయించాలని, నిధులకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే తనకు చెప్పాలని జలమండలి ఎండి మాట్లాడి మంజూరు చేయిస్తానని వివరించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత జిహెచ్ఎంసి నిధులను ఇక్కడే ఖర్చు పెడుతూ మౌలిక సదుపాయాలను కల్పిస్తూ,అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు వివరించారు.డ్రైనేజీ ట్రంకు లైన్ పూర్తి చేయాల్సిన విషయంపై ఇటీవల జలమండలి ఎండి అశోక్ రెడ్డితో మాట్లాడినట్లు వివరించారు. తొందరగా పూర్తి చేయించే చర్యలు చేపడతామని తెలిపారు.అంతేకాకుండా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినప్పటికీ ఫ్లోర్ మ్యాట్ ఏర్పాటు చేయకపోవడంపై అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు.వారం రోజుల్లో మ్యాట్ ఏర్పాటు చేసి వాకర్స్ ఇబ్బందులు తొలగించాలని వివరించారు.అదేవిధంగా ఆటోనగర్ లోని జింకల పార్కు ను మధుయాష్కీ సందర్శించారు. వాకర్స్ తో కలిసి పార్కులో వాకింగ్ చేశారు.పెరుగుతున్న కొత్తగా రెండు ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేయాలని కోరారు.యోగా షెడ్ ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడ్డ సత్యనారాయణ, నాయకులు భీమిడి రామకృష్ణారెడ్డి, సుధాకర్ గౌడ్, కళ్లెం నరసింహారెడ్డి, రమేష్‌నాయక్, దాము మహేందర్ యాదవ్, కొండోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి అభివృద్ధికి కృషి

**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

**హన్మకొండ మహా;** హన్మకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో నిర్మాణంలో ఉన్న రోగుల సహాయకుల భవనం, బ్లడ్ బ్యాంక్ ప్రధాన గేట్ పక్కన ఉన్న ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ,ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ ప్రసూతి ఆసుపత్రిలో ఓపి సేవలను, స్కానింగ్ రూమ్, ప్రసవానంతర వార్డు లను పరిశీలించారు. ప్రసవానంతర వార్డు లోని బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రిలోని సెమినార్ హాల్ లో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశంలో ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న పేషంట్ బెడ్ల సంఖ్య, రోజుకు ఓపీ సేవలకు వస్తున్న వారి సంఖ్య, ఇప్పుడున్న వసతులు, వైద్యులు, సిబ్బంది, ఆసుపత్రి నిర్వహణకు వస్తున్న బడ్జెట్, తదితర వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, కమిటీ సభ్యులకు తెలియజేశారు.

## దేశ రక్షణకై సాహసోపేతమైన నిర్ణయాలు

**మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** వికసిత్ భారత్ అమృత కాలం సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి, మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిందని ఎంపీ రఘు నందన్ రావు అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని లహరి గార్డెన్స్ లో, దేశ ప్రధానిగా నరేంద్రమోదీ, బిజెపి ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గత 11 ఏళ్లలో దేశ ప్రధాని నరేంద్రమోదీ, బిజెపి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, తీసుకున్న ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలను ప్రజలకు తెలిపేందుకు మంగళవారం జిల్లా శాఖ ఏర్పాటు చేసిన కార్యశాలకి ముఖ్య అతిథిలుగా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ... వికసిత్ భారత్ అమృత కాలం సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి, మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పరుగులు పెట్టింది... సేవ, సుసంపన్న పాలన, సాధికారతకు నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. దేశ రక్షణ విషయంలో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొని, మొన్న జరిగిన సింధూర్ యుద్ధంలో పాకిస్తాన్ పై సాధించిన విజయం దీనికి నిదర్శనం అని తెలిపారు. బిజెపి ప్రభుత్వం రైతులకు రైతు సంక్షేమానికి ఎల్లప్పుడూ ముందుండి, రైతులకు కావలసిన పనిముట్లను అందిస్తూ, మద్దతు ధరను కల్పిస్తుందని అన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

**రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్**



**ఎల్బీనగర్,మహా:** ఈ నెల 14న జరగబోయే లోక్ అదాలత్ ను కక్షిదారులు అందరూ సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలని రాజీ మార్గమే రాజమార్గమని రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ సూచించారు.జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయ సేవా ధికార సంస్థ ఆదేశాల మేరకు జూన్ 14న (రెండవ శనివారం) రోజున రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్ట్ లలో లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఇప్పటి వరకు కోర్ట్ ముందుకు రాని కేసులు కానీ కోర్ట్ లలో పెండింగ్ లో ఉన్న కేసులు కానీ పరిష్క రించుకునే/రాజీ చేసుకునే వేదిక ఈ లోక్ అదాలత్ అని సూచించారు. లోక్ అదాలత్ లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. న్యాయస్థానంలో పెండింగ్ లో ఉన్న కేసు లోక్ అదాలత్ కు పంపబడి, అ తర్వాత పరిష్కరించ బడినట్లయితే, వాస్తవానికి కోర్టులో చెల్లించిన కోర్టు రుసుము కూడా పార్టీలకు తిరిగి చెల్లించబడుతుందని తెలిపారు.ఈ లోక్ అదాలత్ ల ద్వారా సమయంతో పాటు డబ్బు వృధా కాకుండా ఉంటుందన్నారు.ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీకి వచ్చే క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, డబ్బు రికవరీకి సంబంధించిన కేసులు,మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, లేబర్ కేసులతో పాటు ఇతర రాజీకి వీలున్న కేసులు పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఇట్టి అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసు కోవాలన్నారు.

# భయ భ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు

**డీఎస్పీ జీవన్ రెడ్డి**



**ఆదిలాబాద్, మహా:** ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని, ప్రజలను బెదిరించే రౌడీలను అరెస్టు చేసి రిమాండుకు తరలిస్తున్నట్లు డీ ఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో మం గళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని రౌడీ షీటర్ ను అరెస్టు చేసిన కేసు వివరాలను తెలియచేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ... స్థానిక ఇందిరమ్మ కాలనీ కి చెందిన రాజు, బంగారిగూడ కు చెందిన ముజ్జు వద్ద ఋణం తీసుకున్నాడని, ఋణం వసూలు విషయంలో ముజ్జు, సమీర్ తో పాటు రౌడీ షీటర్ సలీం లు ఆయన వద్దకు వెళ్లి చంపేస్తామంటూ బెదిరించారని తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నా రు. వారి నుండి మూడు సెల్ ఫోన్లు, ఒక ఐఫోన్ కారును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. జిల్లాలో రౌడీయిజం అవసాన్ని లేకుండా ఎస్పీ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు ఎటువంటి భయం లేకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# రద్దీ ప్రాంతాల్లో సమస్యలు లేకుండా చర్యలు

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**




**ఆదిలాబాద్, మహా:** పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. స్థానిక శివాజీ చౌక్ లో ఎస్బీఐ బ్రాంచ్ సహకారంతో ఏర్పాటు చేసిన పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ ను మంగళవారం ఎస్పీ ప్రా రంభించారు. కార్యక్రమ ముఖ్య అతిథిగా హాజరైన ఆయన. ప్రత్యేక పూజలు జరిపి సబ్ కంట్రోల్ రూమ్ ను ప్రారంభించారు. అనంతరం బ్యాంకు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలి కారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లా డుతూ....గ్రామీణ ప్రాంతాల నుండి శివాజీ చౌక్ కు ఎక్కువ సంఖ్యలో ప్రజలు వస్తుంటారని, ఇక్కడ ఎస్బీ ఐ బ్యాంక్ బ్రాంచ్ కూడా ఉందన్నారు. ఇటువంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా, ఎటువంటి నేరాలు జరగకుండా సబ్ కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నేరాల నియంత్ర ణకు కృషి చేస్తున్నట్లు వివరించారు. డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్,ఎస్బీఐ బ్రాంచ్ రీజనల్ మేనేజర్ రామచంద్ర రావు పాల్గొన్నారు.

# పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలి



**ఆదిలాబాద్, మహా:** పత్తి పంట సాగులో సస్య రక్షణ చర్యలు పాటించి మంచి దిగుబడులు పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ సూచించారు. తలమడుగు మండలం సఖినాపూర్ గ్రామంలో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ లో భాగంగా అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు పాటిం చవలసిన సస్యరక్షణ చర్యలు, రసాయన మందుల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించా రు. ఈ మేరకు డాక్టర్ కే. రాజశేఖర్ మాట్లాడుతూ.... పత్తిలో అధిక సాంద్రత పద్ధతి ద్వారా మంచి దిగుబ డులు పొందవచ్చని అన్నారు. సమగ్ర సస్యరక్షణ పద్ధ తులను పాటిస్తూ విత్తన శుద్ధి తప్పకుండా చేసుకోవా లని తెలిపారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ ఎప్పటికపుడు సందేహాలను నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో శాస్త్రవేత్త శివచరణ్, వ్యవసాయ విస్తరణ అధికారి కీర్తి, రైతులు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతుల హత్య కేసును ఛేదించిన రాజేంద్రనగర్ పోలీసులు

## చివాట్లు పెడుతున్నందుకు హత్య చేశాం

### ఇద్దరు నిందితుల వద్ద ఒక కత్తి, ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం



**రాజేంద్రనగర్ మహా;** వృద్ధ దంపతుల హత్యకేసును నాలుగు రోజుల్లో ఛేదించిన రాజేంద్రనగర్ పోలీసులు. రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్ మంగళవారం విలేక రుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించా రు. షేక్ అబ్దుల్లా, రిజ్వానా దంపతులు గతంలో రెడ్ హిల్స్ లో ఉండేవారు. 40 రోజుల క్రితం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జన చైతన్య వెంచర్ ఫేజ్ 2 లో అబ్రిజ్ రెసిడెన్సి అపార్ట్మెంట్ ఐదవ అంతస్తు డూప్లెక్స్ లో ఉంటున్నారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని జన చైతన్య వెంచర్ ఫేజ్ 2 లో అబ్రిజ్ రెసిడెన్సిలో షేక్ అబ్దుల్లా, రిజ్వాన వృద్ధ దంపతుల మర్డర్ కేసున రాజేంద్ర నగర్ పోలీసులు సవాలుగా స్వీకరించారు. సైబరాబాద్ సీపీ పర్యవేక్షణలో ఆరు బృందాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలింపు చర్యలు చేప ట్టారు. నిందితులు మెదక్ కు చెందిన మహమ్మద్ షకీల్ సల్మాన్,మహమ్మద్ ముజుబుద్దిన్ ను మెదక్ లో రాజేంద్రనగర్ పోలీసులు అదుపులోకి తీస్తు న్నారు. హంతకుడు మహమ్మద్ షకీల్ సల్మాన్ వృత్తి రీత్యా డ్రైవర్,కాగా మృతుడు షేక్ అబ్దుల్లా వద్ద మహ మ్మద్ష కీల్ 2 సంవత్సరాలు డ్రైవర్ గా పనిచేశాడు. మహమ్మద్ షకీల్ సల్మాన్ ను గత 8 నెలల క్రితం పని నుండి తొలగించాడు. మృతుడు షేక్ అబ్దుల్లా వద్ద డ్రైవర్ మాహమ్మద్ షకీల్ పని చేసే క్రమంలో మృతుడు డ్రైవర్ ని పలుమార్లు అవమానపరిచేటట్లు చివాట్లు పెడుతూ తిట్టేవాడు, తిట్లను మాటలను మనసులో పట్టుకున్న డ్రైవర్ మాహమ్మద్ షకీల్, తన స్నేహితు డు ముజీబుదిన్ తో కలిసి హత్యకు ఒకరోజు ముందు రెక్కీ నిర్వహించాడు. మహమ్మద్ షకీల్ కు మహమ్మ ద్ ముజబుద్దీన్ గతంలో 40 వేలు డబ్బులు ఇచ్చాడు. డబ్బులు తిరిగి ఇస్తానని నమ్మించి హత్యకు ఉసిగొలి పాడు. సరైన ధృవపత్రాలు చూపించకుండా అలీ అనే మరో వ్యక్తి పేరు వృద్ధ దంపతులకు వాచ్మెన్ ద్వారా తెలిపాడు. అలీ అనే పేరు వినగానే షేక్ అబ్దుల్లా రమ్మని పిలవడంతో 5 తేదీన షేక్ అబ్దుల్లా, రిజ్వాన ఇంటికి బుర్కా వేసుకొని మరొకరు మాస్కు ధరించి వెళ్లి కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసి మృతుని జేబులో ఉన్న 600 రూపాయలతో పరారయ్యారు. ఇద్దరు నిందితు లను మెదక్ లో అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వారి వద్ద నుండి 1 కత్తి, ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు. అడిషనల్ డిసిపి కేఎస్ రావు, రాజేంద్రనగర్ ఏసిపి, సీఐలు, ఎస్సైలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# అతలాకుతలం..

## భీభత్సం సృష్టించిన ఈదురుగాలులు

- ఉరుములు.. మెరుపులతో కూడిన భారీవర్షం
- పడిపోయిన చెట్లు..విరిగిపడిన కరెంటు స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులు భీభత్సం సృష్టించాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఈదురుగాలులు వీయడంతో గంట పాటు జనం భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. భారీ వర్షానికి తోడు తీవ్ర స్థాయిలో గాలులు వీయడంతో జనాలు ఆందోళనకు గురయ్యారు. ఈదురుగాలుల ప్రభా వంతో పట్టణంలోని ప్రధాన కూడళ్లతో పాటు ఆయా కాలనీలలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. కరెంటు స్తంభాలు పడిపోవడంతో విద్యుత్తు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ వృక్షం నెలకొరగడంతో ఆ దారి గుండా బారికేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహారి గోడ కూలిపోయింది. కరెంటు వైర్లు తెగిపోయి ప్రధాన రోడ్లపై పడిపోవ డంతో విద్యుత్తు సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది శ్రమించాల్సి వచ్చింది. విద్యా నగర్, కేఆర్ కే కాలనీ, శాంతినగర్, అంబేద్కర్ నగర్, ఖానాపూర్ తదితర కాలనీ లలో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో సోమవారం రాత్రి నుండి మంగళవారం మధ్యాహ్నం వరకు విద్యుత్తు సరఫరా కాలేదు. విద్యుత్ సిబ్బంది సరఫరా పునరుద్ధరణ కోసం రాత్రి నుండి విశ్రాంతి లేకుండా కష్టపడి పునరుద్ధరించారు. కొన్ని చోట్ల భారీ గాలులకు ఇండ్లు, షాపుల పై కప్పులు ఎగి రిపోయాయి. భారీ వర్షంతో నష్టపోయిన తమను ఆదుకోవాలని బాధితులు కోరారు. ఇదిలా ఉంటే రాష్ట్ర స్థాయి హాకీ సబ్ జూనియర్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ సమయంలోనే ఒక్కసారిగా ఈదు రుగాలులు వీయడంతో గందరగోళం నెలకొంది. కార్యక్రమ ముఖ్య అతిథిగా ఎంపీ గోడం నగేష్ హాజరుకాగా... అదే సమయంలో ఈదురుగాలులు వీశాయి. దీంతో క్రీడాకారులు, అతిథులు మైదానం నుండి బయటకు వచ్చేశారు. ప్రారంభోత్సవం కోసం ఏర్పాటు చేసిన స్టేజ్, కుర్చీలు గాలి తీవ్రతకు ఎగిరిపో యాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అతిథులను పక్కకు తీసుకువెళ్లడంతో ఎంపీకి ప్రమాదం తప్పిన ట్లయింది.

### పల్లెల్లోనూ ఇదే పరిస్థితి

ఈదురుగాలుల ప్రభావం కేవలం పట్టణానికే పరిమితం కాకుండా పల్లెల్లోనూ తీవ్ర స్థాయిలో కనిపించింది. అనేక గ్రామాల్లోనూ చెట్లు విరిగిప డటం.. విద్యుత్ తీగలు తెగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఒక రోజంతా విద్యుత్ లే కపోవడంతో బోర్లు పనిచేయక తాగునీటికి తిప్పలు పడాల్సి వచ్చింది. ఫోన్లలో ఛార్జింగ్ లేకపోవడంతో అత్యవసర పనులు కలిగిన వారికి అవస్థలు పడా ల్సివచ్చింది. చివరకు విద్యుత్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి సరఫరా పునరుద్ధరించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# చదువుతోనే ఆదివాసుల అభివృద్ధి సాధ్యం

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

- అడవిలో ఏడు కిలోమీటర్లు ద్విచక్ర వాహనంపై ప్రయాణించి ఆదివాసులకు అవగాహన
- గంజాయికి దూరంగా ఉండాలని.. ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచన




**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లా పోలీసులు ప్ర జలతో మమేకమై ప్రజలకు అత్యంత చేరువై సేవలను అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నారని ఆది లాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మం గళవారం భీంపూర్ మండలం లోని మారుమూల గ్రామాలైన గుబిడి, టెకిడి రాంపూర్, కరంజీ, భగవా న్పూర్ లను సందర్శించి ప్రజలతో పోలీసు మీకోసం కార్యక్రమాల నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అడవిలో మారుమూల గ్రామం భగవాన్ పూర్ కు ద్విచక్ర వాహనం తో చేరుకొని యువతకు కల్పించారు. ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకో వాలని తెలిపారు. గ్రామాలలో ఎలాంటి గంజాయిని పండించకూడదని, సేవించకూడదని తెలిపారు. చట్ట వ్యతిరేకంగా గంజాయిని పండించిన వారిపై కేసులు నమోదు చేస్తూ ప్రభుత్వ పథకాలు రాకుండా జిల్లా యంత్రాంగానికి సిఫార్సు చేయబడుతుందని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు త్వరలో నే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జాబ్ మేళాను నిర్వ హించడం జరుగుతుందని, ఎక్కువ సంఖ్యలో యువత పాల్గొని ఉద్యోగాలు సాధించాలని సూచించారు. యువత క్రీడారంగంలోనూ అభివృద్ధి చెందాలని నాలుగు గ్రామాలలో వాలీబాల్ కిట్లు క్రికెట్ కిట్లను అందజేసి క్రీడారంగం లో అభివృద్ధి చెందాలని ఆకాం క్షించారు. చిన్నపిల్లలకు చదువు ప్రాధాన్యతను తెలి యజేసి ప్రతి ఒక్కరూ చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు సాధించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. మహారాష్ట్ర తో అనుసంధానంతో ఉన్నం దున ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుం డా ఎలాంటి సమాచారం అయినా తన వద్ద ఉండే ప్రత్యేకంగా నిర్వహించబడుతున్న 8712659973 అనే నెంబర్ కు వాట్సప్ ద్వారా తెలియజేయాలన్నా రు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అదిలాబాద్ జిల్లాలో షీ టీం బృందం మహిళలకు అండగా ఉందని, మహిళల వేధింపుల పట్ల కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినిల కు ఎలాంటి సమస్యలున్నా షీ టీం బృందాలకు తెలి యజేయాలన్నారు. షీ టీం నెంబర్ 8712659953 కు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్.జీవన్ రెడ్డి, జైనథ్ సిఐ డి. సాయినాథ్, భీంపూర్ ఎస్సై పీర్ సింగ్ నాయక్, గ్రామ పెద్దలు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతనం 25000లకు పెంచాలని బీఎంస్ ధర్నా

**కరీంనగర్, మహా:** భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకుమంగళవారం రోజున కరీంన గర్ జిల్లా కలెక్టరేట్ ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి కి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పసుల శ్రవణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్ర భుత్వం కనీస వేతనాల జీవోలను వెంటనే సవరించి కార్మికుల కనీస వేతనం 25000 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు., భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుండి అక్రమంగా నిధులు స్వాహా చేసిన వారిని శిక్షించి, బి ఓ సి బోర్డును ప్రక్షాళన చేసి కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు. అదే విధంగా ఈపీఎఫ్ 95 కనీస పెన్షన్ 1000 నుండి రూపాయలు ఐదువేలకు పెంచాలని, మరియు అసం ఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పా టుచేసి ఈఎస్ఐ,పిఎఫ్ కల్పించాలని పేర్కొన్నారు కరీంనగర్ జిల్లా కేంద్రంలో వంద పడకలతో ఈస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేసి కార్మికులకు ఆధునిక వైద్యం అందించాలని పేర్కొన్నారు, రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రై వర్లకు ఇస్తామన్న 12 000వేల రూపాయలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో కార్మి కుల పక్షాన పెద్ద ఎత్తున రాబోవు కాలంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# ఎకో టూరిజంగా పాకాల అభివృద్ధి



**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలోని పాకాలను ఎకో టూరిజం గా మరింత అభివృద్ధి చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా అటవీ శాఖ అనూజ్ అగ ర్వాల్ తో కలిసి క్షేత్రస్థాయిలో నర్సంపేట రేంజ్ లోని పాఖాలలో గ్రీన్ హెరిటేజ్ క్రింద అభివృద్ధి చేసిన బయోడైవర్సిటీ పార్కును, బట్టర్, ట్రెక్కింగ్, సైక్లింగ్, పగోడాలను పరిశీలించిన అనంతరం కలెక్టర్ పాకాల సరస్సులో బోటింగ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకులకు ఆకర్షించే విధంగా పాకాల సరస్సు పరిసర ప్రాం తాలను మరింత అభివృద్ధి చేయుటకు పటిష్టమైన ప్రణాళికలు రచించాలని డీఎఫ్ఓకు సూచించారు. ఇందులో భాగంగా బయోడైవర్శిటీ పార్క్ ను మరింత అభివృద్ధి పరచడం, పర్యావరణ పర్యా టక అభివృద్ధి చేయాలని, సఫారీ ట్రాక్ ఏర్పాటు, మూలికల తోట పునరుద్ధరణ, సందర్శకులకు రాత్రి బస సౌకర్యాల అభివృద్ధి, చెరకు ప్యాచ్ అభివృద్ధి, పర్యావరణ పర్యాటక సంబంధిత కార్యకలాపా లకు సంబంధించిన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఆర్ ఓ రవి కిరణ్, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య**




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** చేవెళ్ల మండల కేం ద్రంలోని అంబేద్కర్ భవనంలో భారత కమ్యూనిస్టు పార్టీ, చేవెళ్ల మండల సిపిఐ మహాసభలు, మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య హాజరై మాట్లాడుతూ... కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల పైన మైనా రిటీల పైన దాడులు పెరిగాయని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, బడా బాబులకు బడా పారిశ్రామికవేత్తల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి పనిచేస్తుందని, ఎన్నికలకు రాకముందు విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి పౌరుడి అకౌంట్లో 15 లక్షల రూపాయలు వేస్తానన్న మోడీ, 11 సంవత్స రాల ఆయన 11 రూపాయలు కూడా వేయలేని దుస్థితి నెలకొందని వాపోయారు. ఒకపక్క యువతీ యువ కులకు ఉద్యోగాలు రాక చెడు వ్యసనాలకు బానిసలై బలైపోవడం జరుగుతుందని అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తారన్న మోడీ లక్ష ఉద్యోగా లు చేయలేదని తెలిపారు. అదే విధంగా రోజు రోజుకు నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని దానికి అనుగుణంగా ప్రజల యొక్క తరసరి ఆదాయం పెరగటం లేదని వాపోయారు. రోజు రోజుకు ప్రజల యొక్క కొనుగోలు శక్తి తగ్గిపోతుందని ప్రజల కొనుగోలు శక్తి పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఖజానాలో డబ్బులు లేవని చెప్పడం ఎంతవరకు సమంజసమని, ప్రజలు చెల్లించే పన్నులు ఎక్కడ పోతున్నాయని ప్రశ్నించారు. చేవెళ్లలో ని 75వ సర్వే నెంబర్ లో సుమారు రెండున్నర సంవత్స రాల నుండి భూ పోరాటాలతో గుడిసెలు వేసుకున్న, గుడిసె వాసులకు మౌలిక సదుపాయాలు, మంచినీటి సౌకర్యం విద్యుతు సౌకర్యం, మొబైల్ టాయిలెట్ సౌకర్యం కల్పించి, ఇంటి పట్టాలు ఇవ్వాలని లేదా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరారు.

# ఈవీఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీలు

**రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ బి. హరి సింగ్**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ బి. హరి సింగ్. రంగారెడ్డి జిల్లాలోని రాజేందర్ నగర్ ఈవీఎం గోడౌన్స్ ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ త్రై మాసిక తనిఖీ నిర్వహించారు. భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని గదులను రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ బి. హరి సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ తో కలిసి పరిశీలిం చారు. ఈ సందర్భాంగా మాట్లాడుతూ... ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధి కారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ బి. హరి సింగ్ అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతిని ధుల సమక్షంలో ఈవీఎం భద్రపరిచిన గోడౌన్ ను వారి సమక్షంలో సీల్ వేయించడం జరిగినది.

# ఇందిరమ్మ ఇళ్ల పథకం జాబితాల్లో అనర్హుల పేర్లు ఉంటే తొలగిస్తాం

**ఎమ్మెల్యే జీఎస్సార్**



**భూపాలపల్లి, మహా :** ఇందిరమ్మ ఇళ్ల పథకం జాబితాల్లో అనర్హుల పేర్లు ఉంటే తొలగిస్తానని 1భూపాలపల్లి ఎమ్మె ల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవా రం ఉదయం నుండి సాయంత్రం వరకు భూపాలపల్లి నియోజకవర్గం మొగుళ్ళపల్లి మండలంలోని వివిధ గ్రా మాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. మొగుళ్ళపల్లి మండల కేంద్రంతో పాటు ఇప్పలపల్లి, పోతుగల్, కొరికి శాల, గణేష్ పల్లి, పెద్దకోమటిపల్లి, పర్లపల్లి, మొట్లపల్లి, గుండ్లకర్తి, మెట్టుపల్లి, నర్సింగాపూర్, వేములపల్లి, బం గ్లాపల్లి, ఎల్లారెడ్డిపల్లి, పిడిసిల్ల, ములకలపల్లి, ఇస్సిపేట, పాత ఇస్సిపేట, వాగొడ్డుపల్లి, చింతలపల్లి, రంగాపురం గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరీ పత్రాలను జిల్లా అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో విజయల క్ష్మి, జిల్లా హౌసింగ్ పీడీ లోకీలాల్, ఎంపీడీఓ, ఎమ్మార్వో లతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై మంజూరీ పత్రాలను అందజేశారు.



# నాలుగో రోజూ లాభాల్లో సూచీలు

## సెన్సెక్స్ 255, నిఫ్టీ 100 పాయింట్ల లాభం



**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించడంతో బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్లలో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు కూడా మార్కెట్లను ముందుకు నడిపించాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 256.22 పాయింట్లు అందుకొని 82,45.21 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 100.15 పాయింట్లు ఎగబాకి 25,103.20 వద్ద స్థిరపడింది. గడిచిన నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,707 పాయింట్లు లేదా 2 శాతం, నిఫ్టీ 560 పాయింట్లు లేదా 2.27 శాతం చొప్పున పెరిగాయి. ప్రతీకార సుంకాలపై అమెరికాచైనా దేశాల మధ్య మరోసారి చర్చలు జరుగుతుండటం మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. గడిచిన వారంలో ఆర్బీఐ కీలక వడ్డీరేట్లను అర శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం మదుపరుల్లో ఉత్సాహాన్ని ఇచ్చిందని, ముఖ్యంగా ఎనర్జీ, ఐటీ, ఆర్థిక రంగ షేర్లు కదంతొక్కాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. కొటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఇండస్‌ఇండ్, మారుతి, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్‌టీపీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టపోయాయి.

# మారని మైక్రోఫైనాన్స్ సంస్థల తీరు

## ఆగని అధిక వడ్డీరేట్లు, కఠిన రికవరీలు

### ఆర్బీఐ డీజీ ఎం రాజేశ్వర్ రావు

**ముంబై :** సూక్ష్మ రుణ సంస్థల్లో (మైక్రోఫైనాన్స్ కంపెనీలు) అధిక వడ్డీరేట్లు, బాకీల వసూళ్లకు అవలంబిస్తున్న కఠిన చర్యలు ఆగట్లేదని, వీటివల్లే మైక్రోఫైనాన్స్ రంగం ఇబ్బందుల్లో పడుతున్నదని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ల (డీజీ)లో ఒకరైన ఎం రాజేశ్వర్ రావు అన్నారు. ఇటీవల జరిగిన హెచ్ఎస్‌బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఫైనాన్షియల్ ఇంక్లూజన్‌లో మైక్రోఫైనాన్స్ కీలకపాత్ర పోషిస్తున్నదన్నారు. అయినప్పటికీ మైక్రోఫైనాన్స్ కంపెనీల అభ్యంతరకర తీరు మారట్లేదన్నారు. నిజానికి మైక్రోఫైనాన్స్ కంపెనీలకు నిధులు తక్కువ వడ్డీకి, సులువుగా లభ్యమవుతున్నా.. రుణాలపై అధిక వడ్డీరేట్లు వసూలు చేస్తున్నారని, రుణగ్రహీతలపై మితిమీరిన భారం మోపుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు ఎన్నో ఘటనలు సాక్ష్యంగా ఉన్నాయన్న ఆయన.. కొన్ని మైక్రోఫైనాన్స్ సంస్థల అకృత్యాలకు అడ్డుకట్ట పడాల్సి ఉన్నదని వ్యాఖ్యానించారు. వెనుకబడిన ఆదాయ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఉండాల్సిన మైక్రోఫైనాన్స్ కంపెనీలు.. ధనార్జనే లక్ష్యంగా ముందుకెళ్తుండటం విచారకరమని పేర్కొన్నారు. ఇక బీమా పాలసీలనూ విక్రయిస్తున్నారన్నదానిపై స్పందిస్తూ ఆర్బీఐ దీనికి సంబంధించి తగు మార్గదర్శకాలను విడుదల చేయాలని చూస్తున్నట్టు చెప్పారు.


# రేపు మార్కెట్లోకి వివో సరికొత్త 5జీ ఫోన్.. ఫీచర్లు ఇవే!




చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీ వివో తన టీ4 సిరీస్‌లో సరికొత్త మోడల్‌ను దేశీయ మార్కెట్లోకి తీసుకొస్తున్నది. ఇప్పటికే T4, T4x 5G స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తీసుకొచ్చిన సంస్థ వివో టీ4 అల్ట్రా 5జీ పేరుతో (Vivo T4 Ultra) యూజర్లకు పరిచయం చేసింది. 50 ఎంపీ కెమెరా, 5500 mAh బ్యాటరీతో బడ్జెట్ ధరలో అందిచనుంది. దీనిని జూన్ 11న మధ్యాహ్నం 12 గంటలకు భారతదేశంలో విడుదల చేయనుంది. ఈ మొబైల్ ధర, ఫీచర్ల వివరాలు ఇవే.. వివో నుంచి వస్తున్న ఈ కొత్త ఫోన్ 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో 6.67 అంగుళాల (16.94 సెంటీమీటర్లు) pOLED క్వాడ్‌కర్వ్డ్ డిస్‌ప్లేను కలిగి ఉంటుంది. ఇందులో మీడియాటెక్ 9300+ చిప్‌సెట్‌ను ఉపయోగించింది. అదేవిధంగా ఆండ్రాయిడ్ 15 ఆధారిత ఫన్‌టచ్ ఓఎస్ 15 పై రన్ అయ్యే ఈ ఫోన్‌లో LPDDR5X RAM, UFS 3.1 స్టోరేజ్ అందుబాటులో ఉన్నాయి. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ సపోర్ట్‌తో 50ఎంపీ సోనీ ఐఎంఎక్స్ 921 ప్రైమరీ కెమెరా, 50ఎంపీ 3ఎక్స్ పెరిస్కోప్ లెన్స్, 8ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా ఉన్నాయి. లీఫ్ ప్రియుల కోసం, ఈ ఫోన్‌లో 50MP సెల్ఫీ కెమెరా ఉన్నాయి. ఇందులో 90W ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్‌తో 5,500mAh బ్యాటరీ ఉండనుంది. అధికారికంగా ఇంకా వెల్లడించనప్పటికీ.. భారతదేశంలో వివో T4 అల్ట్రా 5G ధర దాదాపు రూ. 35 వేల లోపు ఉంటుందని తెలుస్తున్నది. గతంలో వివో T3 అల్ట్రా 5G మోడల్‌ను కూడా రూ.31,999కి ప్రవేశపెట్టింది. ఈ ఫోన్ ప్రముఖ ఈకామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌తోపాటు వివో ఇండియా ఈస్టోర్, ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లలో (ఆఫ్‌లైన్‌లో) అందుబాటులో ఉన్నది.

# వరుస లాభాలకు బ్రేక్

## ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు..!



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. ఇటీవల వరుస సెషన్లలో లాభాల్లో ముగిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు అస్థిరతకు గురయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,643.73 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికి మార్కెట్లు ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ ఇంట్రాడేలో 82,680.79 పాయింట్ల గరిష్టాన్ని తాకగా.. అత్యల్పంగా 82,240.40 పాయింట్ల కనిష్టానికి తగ్గింది. చివరకు 53.49 పాయింట్లు పతనమై.. 82,391.72 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 1.05 పాయింట్లు పెరిగి 25,104.25 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,160 షేర్లు పెరిగాయి. మరో 1,723 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్ లాభపడగా.. ట్రెంట్, ఆసియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ నష్టపోయాయి. రియాల్టీ ఇండెక్స్ ఒకశాతం పతనం కాగా.. ఐటీ ఇండెక్స్ 1.7 శాతం పెరిగింది. మీడియా ఇండెక్స్ ఒకశాతం వృద్ధిని నమోదు చేసింది. పవర్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం లాభపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగియగా.. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.3 శాతం పెరిగింది.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL






## రబ్బర్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం..

# ఎగసిపడుతున్న మంటలు

దేశ రాజధాని ఢిల్లీలో వరుస ఆగ్నిప్రమాదాలు (Massive fire) ఆందోళన కలిగిస్తున్నాయి. ఇవాళ ఉదయం ద్వారకా ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో తండ్రి, ఇద్దరు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఢిల్లీలోని మరో ప్రాంతంలోనూ ప్రమాదం చోటు చేసుకుంది. మంగోల్‌పురి ఇండస్ట్రియల్ ప్రాంతంలోని రబ్బర్ ఫ్యాక్టరీ (rubber factory)లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని 12 ఫైర్‌ఇంజన్లతో మంటలను అదుపు చేశారు. ఇవాళ ఉదయం 9:58 గంటల ప్రాంతంలో ద్వారకా సెక్టార్ 13 లోని శపథ సొసైటీలో అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. అపార్ట్‌మెంట్‌లోని ఎనిమిది, తొమ్మిది అంతస్తుల్లో మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. దీంతో అప్రమత్తమైన నివాసితులు ప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో భవనంపై నుంచి కిందకు దూకేశారు. అలా ప్రాణాలను కాపాడుకునే క్రమంలో తండ్రి, ఇద్దరు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ముందుగా పదేళ్ల ఇద్దరు చిన్నారులు ప్రమాదం నుంచి బయటపడేందుకు బాల్కనీ నుంచి కిందకు దూకేశారు. పిల్లల తండ్రి 35 ఏళ్ల యష్ యాదవ్ కూడా కిందకు దూకాడు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. అధికారులు వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించగా.. అప్పటికే వారు ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధరించారు.



## రాజస్థాన్‌లో

# విషాదం

### నదిలో మునిగి 8 మంది మృతి

రాజస్థాన్‌లో విషాదం చోటు చేసుకుంది. టోంక్ జిల్లాలోని బనసా నదిలో ఈతకు వెళ్లి ఎనిమిది మంది యువత ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురిని స్థానికులు రక్షించారు. టోంక్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వికాస్ సంగ్వాన్ తెలిపిన వివరాల ప్రకారం.. 25 నుంచి 30 ఏండ్ల మధ్య వయసున్న 11 మంది యువత మంగళవారం ఈత కొట్టేందుకు బనసా నదికి వెళ్లారు. అక్కడ నదిలోకి దిగి స్విమ్ చేస్తూ గల్లంతయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన టోంక్ పోలీసులు.. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సాయంతో నదిలో మునిగిపోయిన వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. ముగ్గురిని ప్రాణాలతో రక్షించగా.. ఎనిమిది మంది నీటిలో మునిగి మృతి చెందారు. మృతదేహాలను నదిలోనుంచి వెలికి తీసిన పోలీసులు అనంతరం పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# భర్త హత్యకు రూ.20 లక్షలు ఆఫర్ చేసిన సోనమ్..!




రాజా రఘువంశీ హత్య కేసులో పోలీసులు విచారిస్తున్నా కొద్దీ నిందితులు పలు కొత్త విషయాలు వెల్లడిస్తున్నారు. తన భర్తను హత్య చేస్తే రూ.4 లక్షలు ఇస్తానని సోనమ్ ముందుగా తమకు ఆఫర్ చేసిందని, హత్య అనంతరం మృతదేహాన్ని లోయలో పడేయడానికి నిరాకరించడంతో ఆఫర్‌ను ఏకంగా రూ.20 లక్షలకు పెంచిందని నిందితులు తెలిపినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత రాజా రఘువంశీ మృతదేహాన్ని లోయలో పడేయడంలో సోనమ్ కూడా తమకు సహకరించిందని నిందితులు పోలీసులకు చెప్పినట్లు సమాచారం. ఇదిలావుంటే రాజాను హత్య చేసిన నిందితులు ముగ్గురూ అతడికి ముఖ పరిచయం ఉన్నవాళ్లేనని పోలీసుల విచారణలో తేలింది. ఆ పరిచయంతోనే నిందితులు రాజాను పలకరించి, మాటల్లో పెట్టి ఒక్కసారిగా దాడిచేసి ప్రాణం తీసినట్లు వెల్లడైంది. కాగా, మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీ, సోనమ్ రఘువంశీ మే 11న వివాహం చేసుకున్నారు. మే 20న మేఘాలయకు హనీమూన్‌కు వెళ్లారు. ఈ క్రమంలో మే 23 నుంచి ఆ జంట ఆచూకీ లేకుండా పోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు జూన్ 2న ఉత్తర కాసీ కొండల్లోని లోతైన లోయలో రాజా రఘువంశీ మృతదేహం కనిపించింది. మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేస్తున్న పోలీసులు నిందితుల నుంచి పలు వివరాలు రాబడుతున్నారు.

# రకరకాల డ్రోన్లు, మిస్సైళ్లతో రష్యా దాడి



**కీవ్:** ఉక్రెయిన్‌పై మంగళవారం రష్యా దాడి చేసింది. రకరకాల డ్రోన్లు, మిస్సైళ్లతో అటాక్ చేసింది. కీవ్‌లోని రెసిడెన్షియల్ ప్రాంతాలతో పాటు ఒడిసా నగరంలోని మెటర్నిటీ ఆస్పత్రిని టార్గెట్ చేశారు. రష్యా తన అటాక్ సమయంలో 315 షాహిద్ టైప్ యూఏవీలను, డెకాయ్ డ్రోన్లు, రెండు కేఎన్23 బాలిస్టిక్ మిస్సైళ్లు, అయిదు ఇస్కాండర్ కే క్రూయిజ్ మిస్సైళ్లను వాడింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌నే ప్రధానంగా టార్గెట్ చేశారు. అటాక్ తర్వాత అనేక జిల్లాల్లో ఎమర్జెన్సీ సర్వీసులు నిర్వహిస్తున్నామని కీవ్ మేయర్ విటాలీ క్లిచ్‌కో తెలిపారు. మంగళవారం ఉదయం కీవ్ అధికారులు స్థానిక ప్రజలకు వార్నింగ్ ఇచ్చారు. ఒడిసా పట్టణంపై కూడా మంగళవారం భీకర దాడులు జరిగాయి. రష్యాకు చెందిన వైమానిక టార్గెట్లను నిర్వీర్యం చేశామని, 322 టార్గెట్లలో 284 కూల్చినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం పేర్కొన్నది. కీవ్, ఒడిసా, డిన్‌ప్రో, చెర్నిహైవ్ ప్రాంతాలపై అతిపెద్ద దాడి జరిగినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు.

# పుతిన్ చాలా మంచి వ్యక్తి.. రష్యా అధ్యక్షుడిపై ఎలాన్ మస్క్ తండ్రి ప్రశంసలు



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పై ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ తండ్రి ఎర్రోల్ మస్క్ ప్రశంసలు కురిపించారు. పుతిన్ చాలా మంచి మనిషి అని, నిలకడగల స్వభాగం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. అలాంటి వ్యక్తిపై పాశ్చాత్య మీడియా తప్పుడు వార్తలను ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మాస్కోలో నిర్వహించిన 'ఫోరం ఆఫ్ ద ఫ్యూచర్ 2050' కార్యక్రమంలో ఎర్రోల్ మస్క్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పుతిన్‌పై ప్రశంసలు కురిపించారు. పుతిన్ చాలా మంచి మనిషి అని, నిలకడ స్వభావం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. కానీ, పాశ్చాత్య మీడియా మాత్రం పుతిన్‌ను ప్రపంచ దేశాల ముందు విలన్‌గా చిత్రీకరిస్తోందని మండిపడ్డారు. అంతేకాదరు రష్యాను శత్రుదేశంలా చిత్రీకరించేందుకు తప్పుడు వార్తలను ప్రసారం చేస్తోందన్నారు. పుతిన్ గురించి వస్తున్న వార్తలన్నీ అర్థం లేనివని ఎర్రోల్ మస్క్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

# మూడు నెలల్లో ఢిల్లీని నాశనం చేశారు

## బీజేపీపై అర్వింద్ కేజ్రీవాల్ విమర్శలు



బీజేపీ సర్కారు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఢిల్లీని నాశనం చేసిందని ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ విమర్శించారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. ఢిల్లీ మాజీ సీఎం, ప్రస్తుత ప్రతిపక్ష నాయకురాలు అతిషిని పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో కేజ్రీవాల్ ఈ పోస్టు పెట్టారు. కూల్చివేతలకు వ్యతిరేకంగా కల్కాజీలోని భూమిహిన్ క్యాంపులో జరుగుతున్న ఆందోళనల్లో ఇవాళ అతిషి పాల్గొన్నారు. దాంతో ఢిల్లీ పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో బీజేపీ ఢిల్లీని సర్వనాశనం చేసిందని విమర్శించారు.



## ఎ.ఆర్. రెహమాన్ కచేరీ..
# బాధితుడికి రూ.55 వేలు పరిహారం

సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఏర్పాటు చేసిన సంగీత కచేరీ కోసం రూ. 10వేలు చెల్లించి ఒక అభిమాని టికెట్ కొన్నాడు. అయితే భారీ వర్షం కారణంగా ఆ షో రద్దు కావడంతో అతను కలత చెందాడు. దీంతో తనకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఆ బాధితుడు కోర్టులో పిటీషన్ దాఖలు చేశాడు. అయితే, రెండేళ్ల విచారణ తర్వాత బాధితుడికి అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చింది. 2023 ఆగస్టు 12న చెన్నైలో మ్యూజికల్ కన్సర్ట్‌కు హాజరు కానున్నానని సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ట్వీట్ చేశారు. దానిని చూసిన అభిమానులు భారీగా టికెట్లు కొన్నారు. అయితే, ఆ రోజు భారీ వర్షం పడటంతో షో రద్దు అయింది. తరువాత, ఈ కార్యక్రమం సెప్టెంబర్ 10న జరిగింది. ఆగస్టులో కొనుగోలు చేసిన టిక్కెట్లతో అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరు కావచ్చని ఈవెంట్ నిర్వాహకులు ప్రకటించారు. అయితే, చెన్నైలోని అన్నా నగర్‌కు చెందిన అర్జున్, ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రూ. 10 వేల టికెట్ కొనుగోలు చేశాడు. సెప్టెంబర్‌లో ఈ కార్యక్రమం జరిగినప్పుడు నిర్వాహకులు సరైన ముందస్తు సమాచారం ఇవ్వకుండా జరిపించడంతో తాను తీవ్ర మనస్తాపానికి గురైనట్లు అర్జున్ పేర్కొన్నారు. దీంతో చెన్నై జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు.

అందులో, అతను ఇలా పేర్కొన్నాడు, "సంగీత దర్శకులు A.R. రెహమాన్ మ్యూజికల్ కార్యక్రమం కోసం రూ.10 వేల టికెట్ కొన్నప్పటికీ, కచేరీని చూడలేకపోయిను. అందుకు నేను చాలా బాధపడ్డాను. కాబట్టి నేను అనుభవించిన మానసిక వేదనకు పరిహారంగా రూ. 10 లక్షలు చెల్లించాలి. టికెట్ రుసుమును వడ్డీతో సహా తిరిగి చెల్లించాలి. ఈ మేరకు ఆదేశాలు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించాడు. అర్జున్ చేసిన ఫిర్యాదును విచారించిన చెన్నై జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్.. త ఎ.ఆర్. రెహమాన్ సంగీత కచేరీని నిర్వహించిన ACTCని పరిహారంగా రూ. 50,000 చెల్లించాలని ఆదేశించింది. పిటిషనర్ అర్జున్‌కు రెండు నెలల్లోగా మొత్తం రూ.55,000 చెల్లించాలని, అందులో రూ.5,000 వ్యాజ్య ఖర్చులుగా చెల్లించాలని ఆదేశించింది.

# మేం ఇబ్బంది పడుతుంటే.. రష్మిక మాత్రం



ప్రస్తుతం పాన్ ఇండియా ట్రెండ్‌లో దూసుకుపోతున్న హీరోయిన్ రష్మిక. పుష్ప 2, ఛావా లాంటి సినిమాల తో వందల కోట్ల కలెక్షన్స్ అందుకున్న ఈమె.. ప్రస్తుతం పలు చిత్రాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా ఉంది. ఈమె నుంచి రాబోతున్న లేటెస్ట్ మూవీ 'కుబేర'. జూన్ 20న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ముంబైలో సాంగ్ లాంచ్ ఈవెంట్ జరిగింది. ఇందులో మాట్లాడుతూ ధనుష్.. రష్మిక గురించి ఇంట్రెస్టింగ్ విషయాన్ని చెప్పుకొచ్చాడు. ఈ సినిమాలో తాను బిచ్చగాడు పాత్ర చేశానని, ఓసారి డంప్ యార్డ్‌లో దాదాపు ఆరేడు గంటలు షూటింగ్ చేయాల్సి వచ్చిందని ధనుష్ చెప్పుకొచ్చాడు. ఆ సమయంలో తామంతా చెత్త నుంచి వచ్చే కంపుతో ఇబ్బంది పడుతుంటే.. రష్మిక మాత్రం నాకేం వాసన రావడం లేదు అని చెప్పేది. దీంతో ఆశ్చర్యపోవడం మా వంతైందని ధనుష్ అన్నాడు. అలానే 'కుబేర'.. జీవితంలోని మరో కోణాన్ని తనకు పరిచయం చేసిందని, చిన్ననాటి రోజుల్ని గుర్తుచేసిందని చెప్పాడు. ఇదే సినిమాలో కీ రోల్ చేసిన నాగార్జున మాట్లాడుతూ.. రష్మికని ఆకాశానికెత్తేశాడు. టాలెంట్‌లో ఈ అమ్మాయి పవర్ హౌస్ అంటూ పొగిడేశాడు. అలానే హీరోగా ఎందుకు చేయట్లేదంటే తనకు నచ్చే స్టోరీలు రావట్లేదని అన్నాడు. శేఖర్ కమ్ములు ఈ స్క్రిప్ట్‌తో తన దగ్గరకు రాగానే విని ఓకే చేశానని చెప్పుకొచ్చాడు. త్వరలో 'కూలీ'తో మరోసారి హిందీ ప్రేక్షకుల్ని పలకరించబోతున్నానని కూడా చెప్పాడు. శేఖర్ కమ్ముల తీసిన 'కుబేర'.. ఆయన గత చిత్రాలతో పోలిస్తే సమ్‌థింగ్ ఉండబోతుంది. కొన్నిరోజుల క్రితం రిలీజైన టీజర్ చూస్తే ఈ విషయం చాలామందికి అర్థమైంది. కాకపోతే ప్రస్తుత ట్రెండ్‌కి తగ్గట్లు ఇది యాక్షన్ మూవీ కాదు. డబ్బు, దాని వల్ల వచ్చే అనర్ధాలు తదితర అంశాలతో సినిమాని తీసినట్లు తెలుస్తోంది. చూడాలి మరి 'కుబేర'.. బిగ్ స్క్రీన్‌పై ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో?

# కత్రినా కైఫ్‌కు క్రేజీ ఛాన్స్..
## ఆ దేశానికి బ్రాండ్ అంబాసిడర్‌గా!



బాలీవుడ్ భామ కత్రినా కైఫ్‌కు అరుదైన ఛాన్స్ దక్కింది. ఆమె పర్యాటక అభివృద్ధికి అంబాసిడర్‌గా ఎంపికైంది. అయితే కత్రినాను ఎంపిక చేసింది మాత్రం మన దేశానికి కాదు. గతేడాది మనదేశంతో దౌత్యపరమైన వివాదానికి తెరలేపిన దేశానికి ఆమె గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. ఆ దేశం మరెదో కాదు.. మన దగ్గర్లోనే ఉన్న మాల్దీవుస్. కత్రినా కైఫ్‌ను మాల్దీవులకు ప్రపంచ పర్యాటక రాయబారిగా నియమించినట్లు మాల్దీవుల మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కార్పొరేషన్ వెల్లడించింది. భారత చిత్ర పరిశ్రమలో ప్రముఖ వ్యక్తి అయిన కత్రినా కైఫ్‌ను మాల్దీవులకు గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం పట్ల తాము సంతోషంగా ఉన్నామని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించేందుకు బాలీవుడ్ హీరోయిన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ అవకాశం రావడంపై బాలీవుడ్ భామ కత్రినా కైఫ్ స్పందించింది. గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై సంతోషం వ్యక్తం చేసింది. మాల్దీవులు అందించే లగ్జరీ, అందాలను సూచించడానికి ఉత్సాహంగా ఉన్నట్లు పేర్కొంది. గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా తన కొత్త రోల్ గురించి కత్రినా మాట్లాడుతూ.. 'మాల్దీవులు లగ్జరీ, సహజ సౌందర్యానికి కేరాఫ్ అడ్రస్. చక్కని ప్రశాంతంగా ఉండే ప్రదేశం. సన్నీ సైడ్ ఆఫ్ లైఫ్‌గా ఎంపికైనందుకు నేను గౌరవంగా భావిస్తున్నా. ఈ సహకారం ప్రపంచ పర్యాటక ప్రేక్షకులకు అత్యుత్తమ ప్రయాణ అనుభవాలను తీసుకురావడం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు ఈ అద్భుతమైన గమ్యస్థానం, ప్రత్యేకమైన ఆకర్షణ, ప్రపంచ స్థాయిలో పేరు పొందేలా సహాయపడటానికి ఉత్సాహంగా ఉన్నానని" తెలిపింది. అయితే ప్రధాని మోదీ పర్యటనకు ముందు ఈ ప్రకటన రావడం విశేషం. వచ్చే నెలలో మాల్దీవుస్‌లో ప్రధాని పర్యటించనున్నారు.

## క్రేజీ కాంబినేషన్?

హీరో రామ్‌చరణ్, దర్శకుడు త్రివిక్రమ్ క్రేజీ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపుదిద్దుకునేందుకు సన్నాహాలు ఆరంభమైనట్లు తెలుస్తోంది. త్రివిక్రమ్ ఓ కథను సిద్ధం చేసి, రామ్ చరణ్‌కు వినిపించారట. ఈ కథ నచ్చడంతో సినిమా చేసేందుకు రామ్‌చరణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్ మెంట్స్, పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంస్థలు నిర్మించనున్నాయని, త్వరలోనే ఈ సినిమాపై అధికారిక ప్రకటన రానుందని భోగట్టా. కాగా ప్రస్తుతం 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో 'పెద్ది' సినిమా చేస్తున్నారు రామ్‌చరణ్. అలాగే దర్శకుడు సుకుమార్‌తో రామ్‌చరణ్ ఓ సినిమా చేయాల్సి ఉంది. మరి..'పెద్ది' తర్వాత రామ్‌చరణ్ సినిమా సుకుమార్‌తో ఉంటుందా? లేక త్రివిక్రమ్‌తోనా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.





## ఉస్తాద్ భగత్ సింగ్
# యాక్షన్‌కి టైమ్ ఫిక్స్..
### షెడ్యూల్ ఎన్ని రోజులు అంటే..!

రాజకీయాల వలన కొన్నాళ్ల పాటు సినిమా షూటింగ్స్‌కి దూరంగా ఉన్న పవన్ కళ్యాణ్ ఇప్పుడు తను కమిటైన ప్రాజెక్ట్‌లు పూర్తి చేసే పనిలో పడ్డారు. దాదాపు రెండేళ్ల క్రితం మేనల్లుడు సాయి దుర్గా తేజ్ తో కలిసి 'బ్రో అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన పవన్ ఆ తర్వాత వెండితెరపై కనిపించింది లేదు. జూలై 28, 2023లో పవన్ చివరి చిత్రం విడుదల అయ్యింది . అయితే 'హరి హర వీరమల్లు'తో ఈ నెల 12న థియేటర్లలోకి వస్తారని పవన్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు. కాని పలు కారణాల వలన ఈమూవీ మళ్లీ పోస్ట్ పోన్ అయింది. మరోవైపు తాను కమిట్ అయిన ఓజీ చిత్ర షూటింగ్ కూడా పూర్తి చేసినట్టు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న విడుదల చేయనున్నారు. పవన్ కమిటైన మరో చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. గబ్బర్ సింగ్ చిత్రం తర్వాత హరీష్, పవన్ కాంబోలో రూపొందుతున్న ఈ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా గమనిస్తూ వస్తున్నారు. ఎట్టకేలకి దీనిపై హరీష్ శంకర్ క్లారిటీ ఇచ్చారు. ఇటీవల కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న హరీశ్ శంకర్ జూన్ రెండవ వారంలో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని తెలియజేశారు. సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందు స్వామివారి ఆశీస్సులు కోసం తిరుమలకు వచ్చామని హరీష్ తెలియజేయడంతో పవన్ అభిమానుల ఆనందానికి అవధులు లేవు. అయితే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా శ్రీలీల హీరోయిన్ గా దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో వస్తున్న అవైటెడ్ మాస్ మసాలా ఎంటర్టైనర్ "ఉస్తాద్ భగత్ సింగ్" చిత్రం చాలా కాలం గ్యాప్ తర్వాత ఫుల్ లెంగ్త్ షెడ్యూల్ షూటింగ్ కి సిద్ధం అయ్యింది. ఈరోజు (జూన్ 10) నుంచి హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో పునః ప్రారంభం అయ్యినట్టు సమాచారం. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ లేని సన్నివేశాలతో షూటింగ్ ప్రారంభించినట్టు తెలుస్తుండగా, జూన్ 12 లేదా 13వ తేదీన పవన్ సెట్స్ లో జాయిన్ అవుతారని టాక్. ఈ షెడ్యూల్ మొత్తం 30 రోజుల పాటు జరగనుంది. చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com